

ఎమ్‌సెట్ ఫలితాలు ఉ.11 గంటలకు విడుదల


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103



సంపుటి - 2 సంచిక -65 శనివారం 10 మే 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## జవాన్ మురళీ నాయక్ వీరమరణం..

నేలకు ఒరిగిన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్

తీవ్ర దిగ్భ్రాంతి చెందిన సిఎం, డిప్యూటీ సిఎంలు

కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటన




న్యూఢిల్లీ/అమరావతిమే 9(జర్నలిస్ట్ వార్త): భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో ఓ తెలుగు జవాన్ వీర మరణం పొందాడు. శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం, కల్లితాండ పంచాయతీకి చెందిన మురళీ నాయక్ యుద్ధ భూమిలో కన్నుమూశాడు. మురళీ నాయక్ మరణంతో స్వగ్రామంలో విషాదం నెలకొంది. తల్లిదండ్రులు శ్రీరాం నాయక్, జ్యోతీ బాయిలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ వీర జవాన్ ఈ దంపతుల ఏ-కై-క సంతానం కావటం గమనార్హం. వీర జవాన్ మురళీ నాయక్ మరణంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. మిగతాది 2లో...

# పాక్ పన్నాగం

## 400 డ్రోన్లతో దాడులకు పాల్పడిన పాక్

## తిప్పికొట్టిన భారత్

### త్రివిధ దళాలతో ప్రధాని భేటీ

గుజరాత్‌లో చర్యలపై సిఎంతో ఆరా

అవసరమైతే అత్యవసర అధికారాలు

ఉపయోగించుకోవాలని సిఎస్‌లకు లేఖ





### భారత్‌లోని 36 సరిహద్దు ప్రాంతాలపై పాకిస్థాన్ డ్రోన్ల దాడి

భారత సైనిక స్థావరాలు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా దాడులు

పౌర విమానాలను రక్షణ కవచంగా పాక్ వాడుతోందని భారత్ ఆరోపణ

న్యూఢిల్లీ,మే 9(జర్నలిస్ట్ వార్త):భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమైన క్రమంలో తాజా పరిణామాలను సమీక్షించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం త్రివిధ దళాధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. డ్రోన్లు, క్షిపణులతో పాకిస్థాన్ దాడులకు తెగబడటం.. భారత్ సైతం వాటిని దీటుగా తిప్పికొట్టిన తరుణంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో సీడీఎస్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ కూడా పాల్గొన్నారు. మిగతాది 2లో...

## స్వదేశీ క్షిపణి ఆకాశ్ సత్తా..




2లో

పాకిస్థాన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతున్న భారత్

భారత లక్ష్యాలపై దాడులను నిరోధించడంలో విజయవంతం

ఆర్మీ, వైమానిక దళాల వద్ద పాక్ సరిహద్దులో మోహరింపు

రక్షణ శాఖ అధికారుల ద్వారా ఏఎన్ఐకి వెల్లడి

## అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు..

- ఈ నెల చివరిలోగా ప్రెస్ అకాడెమీ భవనం ప్రారంభిస్తాం..
- రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..

(హైదరాబాద్)మే 9(జర్నలిస్ట్ వార్త): అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలైన జర్నలిస్టులకు అలాగే వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలసరి పెన్షన్,తీవ్రఅనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాడు నాంపల్లి లోని ప్రెస్ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మండల,



నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా,నిజాన్ని నిర్భయంగా సమాజనికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిని నమ్ముకుని తన జీవితం మొత్తం ఆ వృత్తికే అంకితం అయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారని అన్నారు.ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్ అకాడమీ భవనాన్ని మిగతాది 2లో...

## నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు సిఎం విరాళం

జాతీయ రక్షణ నిధికి విరాళాలు అందచేయాలనిపిలుపునిచ్చిన ముఖ్యమంత్రి

మన సాయుధ దళాలకు అండగా నిలవాలని సూచన



హైదరాబాద్: మే 9(జర్నలిస్ట్ వార్త): తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశ సరిహద్దులను కాపాడుతూ, ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో వీరోచితంగా పోరాడుతున్న భారత సాయుధ దళాలకు మద్దతుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో స్ఫూర్తిదాయక చర్యకు శ్రీకారం చుట్టారు. భారత సాయుధ బలగాలకు సహకారంగా తన ఒక నెల వేతనాన్ని మిగతాది 2లో...

## తెలంగాణ ప్రభుత్వం 'ఆపరేషన్ చేయూత'

### 38 మంది మావోయిస్టుల లొంగుబాటు



ఛత్తీస్‌గఢ్‌లో వివిధ కేడర్లలో పనిచేసిన సభ్యులు

లొంగిపోయినవారికి తక్షణ ఆర్థిక సహాయం అందజేత

ఈ ఏడాది ఇప్పటివరకు 265 మంది లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడి

తెలంగాణ ప్రభుత్వ కల్పిస్తున్న పునరావాస విధానాలు, శాంతియుత జీవనంపై ఆశతో, నిషేధిత సీపీఐ-మావోయిస్టు పార్టీకి చెందిన 38 మంది సభ్యులు శుక్రవారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. మిగతాది 2లో...

## నేడు గచ్చిబౌలి స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీల ఓపెనింగ్ సెర్మనీ




హైదరాబాద్ : మిస్ వరల్డ్ పోటీల ( ఈవెంట్‌ను ప్రభుత్వం ఎంతో ఛాలెంజింగ్‌తో నిర్వహిస్తోంది. ఒకవైపు ఇండియాపాకిస్తాన్ యుద్ధ వాతావరణంలో ఇప్పటికే ఐపిఎల్‌ను వారం పాటు బిసిసిఐ వాయిదా వేసింది. దేశ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో మిస్ వరల్డ్ -2025 పోటీలను కట్టుదిట్టమైన భద్రతల నడుమ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాతీసుకున్న మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు మాదాపూర్ డిసిపి వినీత్ తెలిపారు.శనివారం గచ్చిబౌలి స్టేడియంలో గ్రాండ్ ఓపెనింగ్ సెర్మనీ ఉన్నందున ఈ కార్యక్రమనికి టూరిజం శాఖ పాస్‌లు ఉన్న వారికే అనుమతి ఉంటుందని ఆయన చెప్పారు. ఈవెంట్ కు సంబంధించి ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. "స్టేడియంలో జరిగే ఈవెంట్‌కు 300 నుండి 350 మంది పోలీసులు బందోబస్త్‌లో ఉంటారు.

## కాంగ్రెస్ వి అబద్ధపు హామీలు..

### ఊకదంపుడు ఉపన్యాసాలు

-స్థానిక ఎన్నికల్లో బి ఆర్ ఎస్ సత్తా చాటాలి -మాజీ మంత్రి కేటీఆర్




2లో.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు..





చిన్న చిన్న మరమత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు.
విడతల వారీగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫిక్సడ్ డిపాజిట్ చేసి,దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందని. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్డ్ డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు.
మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1,00,000/-తో పాటు అయిదు సంవత్సరాల వరకు, నెలకు రూ.3000/- ల చొప్పున పెన్షన్, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజుల క్రింద 1 నుండి 10వ తరగతి వరకు చదివే పిల్లలకు నెలకు 1,000/-ల చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందించడం జరుగుతుంది.ఇప్పటి వరకు ఈ ఖాతాలో మొత్తం రూ.8,98,39,000/-లు ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు.ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ,ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదని తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని గడిచిన రెండు రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతృతతో ఎదురుచూస్తున్న ప్రజలకు తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్నారని కొనియాడారు.ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ శ్రీ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

## జవాన్ మురళీ నాయక్ వీరమరణం..

(మొదటి పేజి తరువాయి)

ఈ మేరకు శుక్రవారం తన ట్విటర్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ' దేశ రక్షణలో శ్రీ సత్యసాయి జిల్లా, పెనుకొండ శాసన సభ నియోజకవర్గం, గోరంట్ల మండలానికి చెందిన మురళీ నాయక్ అనే సైనికుడు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుడు మురళీ నాయక్‌కు నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ.. రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్ వీరమరణం పొందడం తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మురళీ నాయక్ చూపిన ధైర్య,సాహసాలు రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తామని తెలిపారు. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మురళి నాయక్ మృతి చెందడంతో వీర జవానుకు పలువురు నేతలు నివాళులర్పించారు. ఎపి డిప్యూటి సిఎం శుక్రవారం పోస్టు పెడుతూ ...ఆపరేషన్ సిందూర్ లో భాగంగా జమ్మూ కాశ్మీర్ యుద్ధభూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం నన్ను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. మురళి నాయక్ చూపిన ధైర్య, సాహసాలు రాష్ట్రానికే గర్వకారణం. మురళీ నాయక్ పార్థివ దేహానికి రాష్ట్రప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తాం. ఆయన కుటుంబానికి అన్నివిధాలా అండగా నిలుస్తామని పేర్కొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం 'ఆపరేషన్ చేయూత'

### 38 మంది మావోయిస్టుల లొంగుబాటు

హైదరాబాద్:**మే 9(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ప్రభుత్వ కల్పిస్తున్న పునరావాస విధానాలు, శాంతియుత జీవనంపై ఆశతో, నిషేధిత సీపీఐ-మావోయిస్టు పార్టీకి చెందిన 38 మంది సభ్యులు శుక్రవారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న వీరు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట ఈ 38 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు పార్టీ సభ్యులు, 16 మంది మిలీషియా సభ్యులు, ఏడుగురు గ్రామ కమిటీ సభ్యులు, ఆరుగురు క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ సభ్యులు, ముగ్గురు చేతన నాట్యమంచ్ సభ్యులు, నలుగురు గెరిల్లా రివల్యూషనరీ డిస్ట్రిక్ట్ సభ్యులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. లొంగిపోయిన వారికి పునరావాసం నిమిత్తం ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయంగా చెక్కులను ఎస్పీ అందజేశారు.తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సంయుక్తంగా గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న 'ఆపరేషన్ చేయూత' వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకున్న వీరు, మావోయిజం మార్గాన్ని వీడి, తమ కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నారని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.
ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస సౌకర్యాలకు ఆకర్షితులై వివిధ కేడర్ల మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోతున్నారని ఎస్పీ పేర్కొన్నారు.

## స్వదేశీ క్షిపణి ఆకాశ్ సత్తా..

**మే 9:-(రిపబ్లిక్ న్యూస్)**
భారతదేశం స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, పొరుగు దేశం పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతోందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. భారత లక్ష్యాలపై పాక్ చేసే కుయుక్తులను భగ్నం చేయడంలో ఈ 'మేడ్ ఇన్ ఇండియా' ఆయుధం కీలక పాత్ర పోషిస్తోందని ఏఎన్ఐ వార్తా సంస్థకు అధికారులు తెలిపారు.భారత సాయుధ దళాలు "మేడ్ ఇన్ ఇండియా" ఆకాశ్ ఉపరితలం నుంచి గగనతలానికి ప్రయోగించే వాయు రక్షణ క్షిపణి వ్యవస్థను పాకిస్తాన్ దాడులను నిరోధించడానికి విజయవంతంగా ఉపయోగిస్తున్నాయని రక్షణ శాఖ అధికారులు ఏఎన్ఐకి వివరించారు. భారత సైన్యం మరియు భారత వైమానిక దళం రెండూ ఈ క్షిపణి వ్యవస్థలను పాకిస్తాన్ సరిహద్దు పొడవునా మోహరించినట్లు వారు పేర్కొన్నారు."భారత లక్ష్యాలపై పాకిస్థాన్ చేసే దాడులను తిప్పికొట్టడంలో 'మేడ్ ఇన్ ఇండియా' ఆకాశ్ గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థను భారత సాయుధ దళాలు సమర్థవంతంగా ఉపయోగిస్తున్నాయి. భారత సైన్యం, వాయుసేన రెండూ పాక్ సరిహద్దు వెంబడి ఈ క్షిపణి వ్యవస్థను కలిగి ఉన్నాయి" అని రక్షణ శాఖ అధికారులు స్పష్టం చేశారు.స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన ఈ ఆకాశ్ క్షిపణి వ్యవస్థ, భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా తక్షణమే స్పందించి, శత్రువుల ప్రయత్నాలను విఫలం చేసేందుకు ఈ వ్యవస్థలు నిరంతరం సన్నద్ధంగా ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈ పరిణామం, భారత రక్షణ రంగ స్వావలంబనను మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.

## నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు సిఎం విరాళం

జాతీయ రక్షణ నిధి కి విరాళంగా అందజేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మనదేశ ధీర సాయుధ దళాలు ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు, మన సరిహద్దులను, ప్రజలను రక్షించేందుకు ప్రాణాలను పణంగా పెట్టి అందిస్తున్న అసమాన సేవలకు చిన్న సహకారంగా, ఒక భారతీయుడిగా తాను ఒక నెల జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా అందిస్తున్నానని ఆయన తెలిపారు. ఈ పవిత్ర లక్ష్యంలో అందరూ భాగస్వాములు కావాలని, తన సహచరులు, పార్టీ నాయకులతో పాటు ప్రతి ఒక్క భారతీయుడిని దీని కోసం ఆహ్వానిస్తున్నానని ఆయన తెలిపారు. మన సాయుధ దళాలకు అండగా నిలుద్దామని, విజయం మన సొంతమని, జై హింద్ అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కాంగ్రెస్ వి అబద్ధపు హామీలు...

### ఊకదంపుడు ఉపన్యాసాలు -స్థానిక ఎన్నికల్లో బి ఆర్ ఎస్ సత్తా చాటాలి -మాజీ మంత్రి కేటీఆర్



**సత్తుపల్లి/మే9(జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ పార్టీ వి అబద్ధపు హామీలు..ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ప్రజలకు చేసిందేమి లేదని, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో డిసీఎంఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ రాయల శేషగిరిరావు విగ్రహని మాజీ మంత్రి కేటీఆర్ చేతులమీదగాఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా
సత్తుపల్లి నియోజకవర్గంలో గులాబీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. కేటీఆర్ రాకతో గులాబీ సైన్యం చీమలదండులాగా కదిలింది.బైక్ ర్యాలీ చేసి కేటీఆర్ కి ఘన స్వాగతం పలికిన గజమాలతోసత్కరించారు సత్తుపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ శ్రేణులు. సత్తుపల్లి నియోజకవర్గం తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో డిసీఎంఎస్ మాజీ చైర్మన్ స్వర్గీయ రాయల శేషగిరిరావు విగ్రహాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే లు కందాల ఉపేందర్ రెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, రేగా కాంతారావు, భానోత్ హరిప్రియ, కొండ బాల కోటేశ్వరరావు, మదన్ లాల్, మెచ్చ నాగేశ్వరరావు, మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ మరియు జిల్లా ముఖ్య నాయకులతో కలిసి ఆవిష్కరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ . స్వర్గీయ రాయల శేషగిరిరావు ఆత్మకు శాంతి చేకూరాలని ఒక నిమిషం మౌనం పాటించారు.అనంతరం మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ రాయల శేషగిరిరావు విగ్రహ ఆవిష్కరణకు నన్ను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు జరగకా రైతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాట్లు తెలిపారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఫలితం లేకపోయిందని గుర్తు చేశారు.17 నెలల్లో జిల్లాకు ఏం జరిగిందో ప్రజలు ఆలోచన చేయాలని, కేసీఆర్ ప్రజల కోసం సీతారామా ప్రాజెక్ట్ తెస్తే ఆ నీళ్ళు నెత్తిన జల్లుకునారు కానీ ప్రజలకు ఏమి చేయడం లేదన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి అఫిడవిట్, నోట్‌లు అబద్ధపు హామీలు అన్ని ఇచ్చాడన్నారు.తప్పకుండా ఇచ్చిన హామీని 100 రోజుల్లో చేస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప చేసింది ఏమిలేదని, ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని తెలిపారు.కేసీఆర్ కిట్ అనే పథకం అద్భుతమైన పథకం. కాంగ్రెస్ వచ్చాక ఆ పథకం ఎత్తేశారన్నారు. రైతుబంధు గురించి ఆనాడు రెండు పంటలకు ఇస్తావా? అని అడిగిన రేవంత్ నేడు ఒక్క పంటకి కూడా ఇవ్వడం లేదన్నారు. రైతు రుణమాఫీ లేదు, షాది ముబారక్ లేదు వాళ్ళు చెప్పిన ఏ హామీ అయినా నెరవేర్చరా? అంటూ ప్రశ్నించ్చారు. కాంగ్రెస్‌ను నమ్మి మంచి మంచి నాయకులను ఓడగొట్టారు.మార్పు బాగుందా? మార్పు కావాలని జిల్లా మొత్తం కాంగ్రెస్‌కి ఓటేశారన్నారు.10 ఏళ్ల పాలన చేసిన కేసీఆర్‌ను కాదని కాంగ్రెస్ విసిరిన ఆనందమైన వలలో చిక్కుకున్నారు.6 గ్యారెంటీలు కాకుండా 420 హామీలు ఇచ్చారన్నారు.నేను చాలా మంది ముఖ్యమంత్రులను చూసా, ఎవరూ కూడా రేవంత్ రెడ్డి లాగ దివాళాకోరు మాటలు మాట్లాడలేదని తెలిపారు. ఢిల్లీకి పోతే దొంగలాగా చూస్తున్నారంటున్నా రేవంత్.. దొంగను దొంగలాగే చూస్తారు కదా.ఢిల్లీలో అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదు. అపాయింట్‌మెంట్ ఇస్తే చెప్పులు ఎత్తుకుపోతాడని అంటున్నారని తెలిపారు. జూన్, జులైలో స్థానిక సంస్థల ఎన్నికలు పెడతారని తెలుస్తుందన్నారు. ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి ప్రజల్లో ఉండాలి. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో బి ఆర్ ఎస్ కార్యకర్తలు చాటాలన్నారు.
ఢిల్లీ పార్టీలను నమ్మొద్దని కేసీఆర్ చిలక్కి చెప్పినట్టు చెప్పారు. ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా మీకోసం పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని గుర్తు చేశారు.రాబోయే రోజుల్లో మన ఇంటి పార్టీ మన తెలంగాణ పార్టీని ఆశీర్వదించాలి అని కోరారు. అనంతరం రాయల శేషగిరిరావు రావు నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి ఘనంగా నివాళులు



అర్పించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో జన్మించిన స్వర్గీయ రాయల శేషగిరిరావు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు పై ఉన్న అభిమానం తో టీడీపీ లో పనిచేసిన ఆయన మొట్టమొదటి సారిగా 1987 లో ఎంపీపీ గా ఎన్నికయ్యారని,ఆ తరువాత ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా 2006-2007 సంవత్సరాల్లో ఖమ్మం జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడుగా చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేస్తున్న పోరాటానికి ఆకర్షితుడై అప్పటి తెరాస లో చేరిన రాయల శేషగిరిరావు కి కేసీఆర్ ప్రభుత్వంలో 2014 లో డిసిసిబి డైరెక్టర్ గా పనిచేశారని, 2019 లో డీసీఎంఎస్ చైర్మన్ గా సేవలు అందించిన ఆయన అనారోగ్య కారణాల వలన 2024 మే 15 న హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందటం బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు అని తెలిపారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎప్‌సెట్ ఫలితాలు ఉ.11 గంటలకు విడుదల చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్:**మే 9(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో ఇం జనీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన (%+ జూూ్రాజజు%) టిజి ఎప్‌సెట్ 20 25 ఫలితాల విడుదల ముహూర్తం ఖరారైం ది. ఆదివారం(మే 11) ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఎప్‌సెట్ ఫ లితాలను విడుదల చేయనున్నారు. ఎప్‌సెట్ లో విద్యార్థులు సాధించిన ర్యాంకులు, మా ర్కుల జాబితాను సిఎం విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు.
ప్రాథమిక కీతో పాటు రెస్పాన్స్ షీట్, మాస్టర్ క్వశ్చన్ పేపర్‌ను డౌన్‌లోడ్‌కుఅందుబాటులోకి ఉంచారు. ప్రాథమిక కీ లపై విద్యార్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ పరిశీలించి తుది కీ ఖరారు చేయనున్నారు. ఆదివారం తుది కీ తో పాటు ఫలితాలు ప్రకటించనున్నారు. ఏప్రిల్ 29 నుంచి ఈ



నెల 4వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో ఎప్‌సెట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలకు 2,07,190 మంది విద్యార్థులు హాజరుకాగా, అగ్రికల్చర్, ఫార్మా విభాగం పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 81,198 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# పాక్ పన్నాగం



(మొదటి పేజి తరువాయి)

అంతకుముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, హోంశాఖలోని సీనియర్ అధికారులతో భేటీ అయ్యారు. సరిహద్దుల్లో, విమానాశ్రయాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోన్న పాక్.. ఇప్పుడు మనపై రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది. డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నిస్తోంది. వీటిని భారత బలగాలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. ఈ పరిణామాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. తాజాగా ఆయన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ భద్రతా సన్నద్ధతపై ప్రధాని ఆరాతీసి ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భద్రతాపరంగా సున్నిత ప్రాంతాలైన కచ్, బనస్కంతా, పటాన్, జామ్‌నగర్‌లో పౌరుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అడిగారు. ఇవన్నీ పాక్‌తో సరిహద్దు కలిగిన ప్రాంతాలు. ప్రస్తుతం శత్రు దేశం నుంచి దాడుల ముప్పు పొంచి ఉన్న వేళ.. సరిహద్దు జిల్లాల్లో యంత్రాంగం అప్రమత్తమైంది. ఎప్పటికప్పుడు అధికారులు ప్రజలకు సూచనలు జారీ చేస్తున్నారు. మరోవైపు, ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం కీలక చర్యలు చేపడుతోంది. ఇప్పటికే రక్షణశాఖ ఉన్నత స్థాయి భేటీ నిర్వహించగా.. ఆర్థిక, హోం, ఆరోగ్య శాఖల్లోనూ వరుస సమావేశాలు జరుగుతున్నాయి. తమ మంత్రివర్గంలోని ఉన్నతాధికారులతో ఆయా కేంద్రమంత్రులు భేటీ అయ్యారు. సరిహద్దు రాష్ట్రాల్లో పరిస్థితులు, ఆర్థికపరంగా సన్నద్ధత, ఆరోగ్య సేవల అందుబాటు- తదితర అంశాలపై చర్చించారు. పాకిస్తాన్ తో యుద్ధ వాతావరణం నేపథ్యంలో కేంద్ర హోం శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు లేఖలు రాసింది. 1968 సివిల్ డిఫెన్స్ చట్టంలోని రూల్ 11 వినియోగించుకోవాలని ఆ లేఖలో తెలిపింది. అయితే, రూల్ 11 ప్రకారం సైరన్ వంటి అత్యవసర పరికరాలు కొనేందుకు పూర్తి అధికారం ఇస్తున్నట్లు- ప్రకటించింది. ఇక, అవసరమైతే అత్యవసర అధికారాలు ఉపయోగించుకోవాలని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. అయితే, భారత్ లోని సరిహద్దు నగరాల్లో పాకిస్తాన్ దాడి చేస్తుందనే ముందస్తు సమాచారంతో ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న నగరాల్లో భద్రతాను పటిష్టం చేశారు. ఇక, ప్రజలను అలర్ట్ చేయడానికి సైరన్ లను ఉపయోగిస్తుంది భద్రతా దళాలు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వాలు అలర్ట్ గా ఉండి పౌరుల భద్రతకు పూర్తి స్థాయిలో కట్టు-బడి ఉండాలని సూచనలు చేసింది.
భారత్‌లోని కీలక సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ గురువారం రాత్రి భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి పాల్పడిందని భారత ప్రభుత్వం వెల్లడించింది. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని సుమారు 36 ప్రాంతాలపై 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించిందని భారత సైన్యం తెలిపింది. ఈ దాడుల వెనుక భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచారాన్ని సేకరించడమే పాక్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంది.'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ సంచలన విషయాలను తెలిపారు.
గురువారం రాత్రి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దిగి, నియంత్రణ రేఖ వెంబడి ఉల్లంఘనలకు పాల్పడుతూ భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు



ప్రారంభించిందని వారు వివరించారు. పాక్ వైపు నుంచి వచ్చిన అనేక డ్రోన్లను భారత బలగాలు కూల్చివేశాయని, ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారని వారు పేర్కొన్నారు. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తత కొనసాగుతోందని, పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుందని తెలిపారు. దాడుల కోసం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' రకం డ్రోన్లను పాకిస్థాన్ ఉపయోగించినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసిందన్నారు.ఈ దాడుల సందర్భంగా పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుందని భారత రక్షణ శాఖ ప్రతినిధులు తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు ప్రారంభించినప్పటికీ, కరాచీ, లాహోర్ మధ్య పౌర విమాన సర్వీసులను నిలిపివేయలేదని వారు తెలిపారు. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన వస్తుందని తెలిసి కూడా, పౌర విమానాలను అడ్డుపెట్టుకోవడం ద్వారా పాకిస్థాన్ అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించిందని అన్నారు.ఇది భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో ప్రయాణించే విమానాలతో పాటు, పాకిస్థాన్‌లోని పౌర విమానాలకు కూడా సురక్షితం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పాకిస్థాన్ ప్రార్థనా మందిరాలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందని, ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు.
అంతర్జాతీయ విమానయాన నిబంధనలను, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భారత వాయుసేన పూర్తి సంయమనంతో వ్యవహరించిందని కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు స్పష్టం చేశారు. పాకిస్థాన్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి కవ్వింపు చర్యలను భారత్ ఉపేక్షించబోదని వారు హెచ్చరించారు

# ఎండ తీవ్రతకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

**- వర్ధన్నపేట సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి**





**వర్ధన్నపేట/మే 8(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహస్వామి ఎండ తీవ్రతకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గురువారం అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన ప్రత్యేకించి పరీక్షించారు. ఈ సందర్భంగా ఏ సమస్య ఉన్న భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అనుభవం కలిగిన వైద్యుల చేత నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ఏ చింతన లేకుండా అనారోగ్య సమస్యలు వస్తే, ప్రతి ఒక్కరూ వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందాలని వారితో మాట్లాడారు. వేసవి ఎండలు రోజురోజుకు మరింత తీవ్ర రూపాన్ని దాలుస్తున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ క్రమంలో అత్యవసరమైతే తప్ప ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లే అవకాశం తీసుకోవద్దన్నారు. వీలైతే ఘన పదార్థాలను తీసుకోవడానికి బదులు ద్రవపదార్థాలను ఎక్కువగా ఉపయోగించాలన్నారు.

## ఎల్లమ్మ విగ్రహా ప్రతిష్ఠ కి ఎమ్మెల్యే నాగరాజు ని ఆహ్వానించిన ఈ వో అద్దంకి



**వర్ధన్నపేట/మే9(జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థాన ఆవరణలోని నూతన ఎల్లమ్మ దేవాలయంలో ఎల్లమ్మ విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. ఆర్ నాగరాజు ని శుక్రవారం దేవాలయ కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండ హాజరవుతానని తెలిపారు.

ఈ సందర్భంగాదేవాలయ కార్యనిర్వహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ హన్మకొండ జిల్లా ఐనవోలు మండలంలోని మల్లీ కార్జున స్వామి దేవాలయం ఆవరణంలో ఎల్లమ్మదేవీ విగ్రహ సప్రతిష్ఠా పూర్వక ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవ సోమవారం నిండి బుధవారం జరుగుతుందన్నారు. కార్యక్రమములు తేది. 12-05-2025 సోమవారము రోజున ఉత్సవ అనుజ్ఞ, ఆలయ ప్రదిక్షిణ పూర్వక యాగశాల, ప్రవేశన, అగ్ని ప్రతిష్ఠాపన, నీరాజన, మంత్ర పుష్ప సమర్పణ, నిత్య బలిహరణ జరుగుతుందాన్నారు. 13-05-2025 ప్రాతశాపాసన, వాస్తు పూజన, వాస్తు శాంతి, పర్యగ్నికరణ, లక్షణోద్ధారణ, జలాధివాసన, బింబశుద్ధి, ధాన్యాధివాసన, కళానాహన, శాంతి హవన, పంచావరణ స్థాపన, తత్త్వత్రయ మూలమంత్ర హవన, నీరాజన, మన్త పుష్ప సమర్పణ, నిత్యబలిహరణ, తీర్థప్రసాద వితరణ జరుగుతయాన్నారు. విగ్రహా ప్రతిష్ఠా సుముహూర్తం14-05-2025 బుధవారము రోజున ఉదయం గం 9-14 ని మీశాలకు అనూరాధ నక్షత్రయుక్త మిధునలగ్న శుభ సుముహూర్తమున విగ్రహా ప్రతిష్ఠాపన నిర్వహించబడుతుందన్నారు.



# పర్వతగిరి సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ మృతి

**- నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు**




**పర్వతగిరి/మే 9(జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన పర్వతగిరి మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్ట శ్రీనివాస్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు మృతిని నివాసానికి వెళ్లి ఆయన భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. శోకసంద్రంలో ఉన్న మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. పార్టీ కోసం పని చేస్తూ, అహర్నిశలు కృషిచేసిన శ్రీనివాస్ లేని లోటు తీరనిది అన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేసిన తన కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వారి వెంట ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్స్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ చంద్రపాలకల ప్రభాకర్ అనారోగ్యంతో మృతి

**- నివాళులు అర్పించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



**హనుమకొండ/మే 9(జర్నలిస్ట్ వార్త):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 55 డివిజన్ భీమారం ఆనంద నగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ చంద్రపాలకల ప్రభాకర్ అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వారి నివాసానికి వెళ్లి ఆయన భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట రిటైర్డ్ పోలీస్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పిన్నింటి అనిల్ రావు, గడ్డం శివరాం ప్రసాద్, కొంక హరిబాబు, దేవరకొండ అనిల్, జున్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, పైడిపాల రఘుచందర్, బైరి లింగమూర్తి, గడ్డం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జిగా అనిమిరెడ్డి కృష్ణారెడ్డి



**వర్ధన్నపేట/మే9(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డిని వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జిగా శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నియమించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో అధికారంలోకి తీసుకువచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, భూక్య శ్రీలత, చిలువేరు శ్రీధర్ పులి శ్రీనివాస్ చందు రవి తో పాటు తదితర కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## చందానగర్ లో అగ్నిప్రమాదం

హైదరాబాదు**మే 9(జర్నలిస్ట్ వార్త):**

హైదరాబాదులోని చందానగర్ లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ షాపింగ్ కాంప్లెక్స్ లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలము చేరుకొని మంటలను అదుపులోకి తెస్తున్నారు. భారీగా మంటలు ఎగిసి పడడంతో పక్క దుకాణాలకు మంటలు వ్యాప్తించాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంవత్సరం క్రితం కూడా ఇదే కాంప్లెక్స్ లో అగ్నిప్రమాదం సంభవించింది.

# భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకోవాలి

**- భూభారతి చట్టం ద్వారా సమస్యల పరిష్కరించుకోవాలి - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**





**వర్ధన్నపేట/మే 9(జర్నలిస్ట్ వార్త):** భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేసి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పేర్కొన్నారు. భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పైలట్ ప్రాజెక్టుగా వర్ధన్నపేట మండలం ఎంపికైన విషయం తెలిసిందే అన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట మండలంలోని చెన్నారం గ్రామంలో భూ భారతిలో భూ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులు, రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ పనితీరును కలెక్టర్పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, వారి సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం చెన్నారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుని ఎంపికకు క్షేత్ర స్థాయిలో స్థితిగతులను పరిశీలించి, నిబంధనల మేరకు అత్యంత నిరుపేదను పారదర్శకంగా ఎంపిక చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో వర్ధన్నపేట తహశీల్దార్ విజయ్ సాగర్, రెవిన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో ఏర్పాట్లను పర్యవేక్షించాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





**భూపాలపల్లి/మే9(జర్నలిసస్ట్ వార్త):** శనివారం నుండి అధికారులు కాళేశ్వరంలో మకాం వేసి, అన్ని ఏర్పాట్లను సమీక్షించి పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కాళేశ్వరం దేవస్థానం ఈఓ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్య శిభిరాల ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన స్టేజి, మైక్ ఇతర ఏర్పాట్లు, పారిశుద్ధ్య చర్యలు, సిబ్బందికి ఆహార ఏర్పాట్లపై పర్యవేక్షణకు విధులు కేటాయించిన అధికారులు పటిష్ట పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. అత్యవసర వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. ఈఓ కార్యాలయంలో వైద్య సిబ్బందితో వైద్య సేవలు నిర్వహణపై సమావేశం నిర్వహించారు. మూడు షిఫ్ట లలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. అత్యవసర మందు లు, ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉండాలని తెలిపారు. అత్యవసర సేవలకు మహాదేవపూర్ లో 30 బెడ్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అంబులెన్స్, 108 సేవలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం వివిఐపి ఘాట్ గోదావరిలో నీటిమట్టం, టెంట్ సిటిని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. టెంట్ సిటీ వద్ద వర్షం వచ్చినా బురద కాకుండా భక్తులకు ఇబ్బంది లేకుండా గ్రావెల్ వేయాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వైద్య ఆరోగ్య శాకాధికారి డా మధుసూదన్, డిపిఓ వీర భద్రయ్య, ఆర్ అండ్ బి, పీఆర్ ఇంజినీరింగ్, దేవాదాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



**రాయపర్తి/మే9(జర్నలిస్ట్ వార్త):** పశు పోషకులు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని వెటర్నరీ బయోలాజికల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ విజయ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎఫ్ ఎం డి ముఫ్త్ యోజన పథకంలో భాగంగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల నోరు,గిట్టల మధ్య పుండ్లు,జ్వరం గాలి కుంటు వ్యాధి లక్షణాలు అని అన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులలో పాల ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు. అందుకే వ్యాధి సోకిన తరువాత వైద్యం చేయించడం కంటే ముందుగానే పశువులకు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. 2030 వరకు గాలికుంటు వ్యాధిని సమూలంగా నివారించడానికి ప్రతి ఆరు మాసములకు ఒకసారి ఉచితంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని,పశిపోశకులు ఈ అవకాశాన్ని ఉపయోగంచుకావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎం బాలకృష్ణ, ఏడి నాగమణి,మండల పశువైద్యాధికారిని డాక్టర్ వి శృతి, పశు వైద్య సిబ్బంది మక్బుల్, వెంకటయ్య, సుమన్ జిత్ర , గణేష్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

# చాతి, క్షయ వ్యాధుల వైద్యశాల అంటే
# టీబి హాస్పిటల్ మాత్రమే కాదు

## శ్వాసకోశ చికిత్సాలయంగా ప్రజలు గుర్తించాలి

- ఛాతికి సంబంధించిన అన్ని వ్యాధులకు వైద్య సేవలు
- ఎంతసేపు ఎంజీఎం, ఇతరత్రా హాస్పిటల్స్ వైపు మొగ్గు
- మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్షయ వైద్యశాలలో డాక్టర్లు సిద్ధంగా ఉన్నారు
- హాస్పిటల్ సంప్రదించి ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలి
- హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత







**హనుమకొండ/మే 9(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండలోనిచాతి మరియు క్షయ వ్యాధుల వైద్యశాల ఇప్పటి వరకు టిబి హాస్పిటల్ గానే పిలువబడుతుంది. నిజానికి ప్రజలు అలా భావించుకున్నారే తప్ప, నిజానికి టీబి హాస్పిటల్ మాత్రమే కాదని, శ్వాసకోశ చికిత్సాలయంగా ప్రజలు గమనించాలని శుక్రవారం హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాతి మరియు క్షయ వైద్యశాల అంటే కేవలం టిబి బాధితులను మాత్రమే చూస్తారని ప్రజలు ఒక నిర్ధారణకు వచ్చారని చెప్పారు. వాస్తవానికి చాతికి సంబంధించి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఏర్పడిన అక్కడ అన్ని రకాల శ్వాసకోశ వైద్య సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. వైద్యశాలలో సమయపాలన అంటూ ఏమీ లేదని వివరించారు. 24 గంటల సమయం పాటు ఎడతెరిపి లేకుండా వైద్య సేవలు కొనసాగిస్తూ ఉంటామని తెలిపారు. నిరంతరాయంగా కొనసాగుతున్న తమ సేవలను కేవలం టీబీ బాధితులు మాత్రమే వినియోగించుకోవడం కాదు, శ్వాసకోశ సంబంధిత ప్రతి వ్యాధి గ్రహితులు తమ వద్ద వైద్య సేవలు వినియోగించుకోవాలని సూచించారు. అందుకు సంబంధిత అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. చాలామంది బాధిత వర్గాలకు చాతి, క్షయ వ్యాధుల వైద్యశాలలో ఎలాంటి వైద్య సేవలు అందిస్తారన్న విషయం తెలియకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు కేవలం ప్రతి ఒక్కరికి గుర్తొచ్చేది ఒక్క ఎంజీఎం హాస్పిటల్ మాత్రమేనని అన్నారు. అందుకు నిదర్శనంగానే వరంగల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాలకు సంబంధించిన బాధిత వర్గాలు చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రినే ఆశ్రయిస్తున్నారు. చాతి కి సంబంధించిన ప్రతి అనారోగ్య సమస్య ఉన్నవారు క్షయ వ్యాధుల వైద్యశాలను ఆశ్రయించి చికిత్స పొందాలని కోరారు. వచ్చిన ప్రతి ఒక్కరికి ఓపి ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వ్యాధి నిర్ధారణ జరిగిన తర్వాత వార్డుకి తరలించి, వైద్య సేవలు అందించడం ప్రారంభిస్తామని చెప్పారు. అలా ప్రతి ఒక్క పేషంట్ కి కావాల్సిన అన్ని సదుపాయాలు హాస్పిటల్లో ఉన్నాయని తెలిపారు. దీనికి తోడు వారికి అత్యవసర సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని సూచించారు.

### హాస్పిటల్ నిర్వాహకుల వివరాలు

చాతి మరియు క్షయ వైద్యశాలలో బాధితులకు వైద్య సేవలు అందించేందుకు హాస్పిటల్ లో ఒక సూపరింటెండెంట్, ఒక ఆర్ ఎం, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్, సిఏఎస్, శానిటేషన్, పేషంట్ కేర్, మొత్తం వైద్య సిబ్బంది 30 నుంచి 40 వరకు వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ప్రజలు గమనించాల్సిన విషయం ఏమిటంటే చాతి మరియు క్షయ వైద్యశాల అంటే చిన్నచితక హాస్పిటల్ ఏమీ కాదన్నారు. 100 పడకల ఆసుపత్రి అన్న విషయాన్ని ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు.

### ప్రస్తుతం 70 మంది వైద్య సేవలు పొందుతున్నారు

హాస్పిటల్లో ప్రస్తుతం టీబీ వ్యాధిగ్రహిస్తులు దాదాపు 60 నుంచి 70 మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారని సూపరింటెండెంట్ తెలిపారు. వార్డులలో అడ్మిట్ అయిన పేషంట్ కి కావలసిన అన్ని ఏర్పాట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రతిరోజు వైద్య పరీక్షల కోసం దాదాపు 70 మంది వరకు ఓపి ద్వారా హాస్పిటల్ ఆశ్రయిస్తున్నారని తెలిపారు.
ప్రస్తుతం వ్యాధి నివారణ కోసం వివిధ రకాల సమావేశాలను హాస్పిటల్లో నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలను చేపడతామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలవారీగా వ్యాధి నివారణ చర్యలో భాగంగా డిఎంహెచ్ఓ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తారని అన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు కనీసం మన కారణంగా ఇతరులకు వ్యాధి సోకకుండా జాగ్రత్త చర్యలు పాటించాలని అనుకోవడం కనీస ధర్మం అన్నారు. జనారణ్యంలో తిరుగుతున్నప్పుడు తనకున్న లక్షణాల కారణంగా ఇతరులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందని గుర్తు చేశారు.

### 14 సంవత్సరాలు కావస్తోంది

సాధారణంగా నిర్వహించే వైద్య సేవలతో పాటు క్షయ వ్యాధుల వైద్యశాలలో దాదాపుగా ఆరోగ్యశ్రీ సేవలను ప్రారంభించి 14 సంవత్సరాలు కావస్తోందని అన్నారు. వ్యాధి గ్రహితులు చాతికి సంబంధిత ఎలాంటి సమస్యలు ఉన్నప్పటికీ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు హాస్పిటల్ లో అన్ని అవకాశాలు అందుబాటులోనే ఉన్నాయని అన్నారు. ఇంకా మెరుగైన వైద్య సేవలకు ఆరోగ్యశ్రీ అవకాశం 2011 లో అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. వ్యాధి గ్రహిస్తులు ఎలాంటి భయభ్రాంతులకు గురించవలసిన అవసరం లేదన్నారు.

### ఆరోగ్యమైన ఆహార పదార్థాలు అందిస్తున్నాం

హాస్పిటల్ లో అడ్మిట్ అయ్యి వైద్య సేవలు పొందుతున్న వ్యాధి గ్రహిస్తులకు ప్రభుత్వ ఆదేశానుసారం మెనూ ప్రకారం ఆరోగ్యమైన ఆహార పదార్థాలను అందిస్తున్నామని తెలిపారు.









## గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలకు బాల బాలికల దరఖాస్తులకు ఆహ్వానం

**వరంగల్/మే 9(జర్నలిస్ట్ వార్త):**
2025-26 విద్యా సంవత్సరానికి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలురు మరియు బాలికలకు) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వాధికారి డి.యస్ వెంకన్న శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

**జూనియర్ కళాశాల వివరములు**

1. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), హన్మకోండ (MPC, BPC)
2. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), పాలకుర్తి(MPC, BPC)
3. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), పర్వతగిరి (MPC, BPC)
4. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు) మూడుచెక్కలపల్లి (MPC, BPC)
5. తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలురు) నర్సంపేట (MPC, BPC) గ్రూప్ లలో సీట్లకు గాను గిరిజన, గిరిజనేతర బాల, బాలికల నుండి స్పాట్ కౌన్సిలింగ్ కొరకు ధరఖాస్తులు కోరవడుచున్నవని ప్రాంతీయ సమన్వాధికారి తెలిపారు. ప్రవేశం కావాలనుకునే బాల, బాలికలు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలురు) యాకుబ్ పూర, వరంగల్ యందు తేది 15-05-2025 నాడు కౌన్సిలింగ్ కోరకు 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన బాల, బాలికలు అన్ని ఒరిజినల్ ధ్రువ పత్రములతో పాటు ఒక సెట్ జిరాక్స్ తీసుకోని అడ్మీషన్ పొందవచ్చున్నని తెలిపారు. మిగిత వివరలకై 9490957296 ఫోన్ నెంబర్ సంప్రదించాలని సూచించారు.

## జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

**- రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన**







**హనుమకొండ/మే 9(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధి గుండా వెళ్తున్న 163జి గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధిలో జాతీయ రహదారి 163జి, పురోగతి పై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారదా, సీజిఎం ఆర్వో శివశంకర్, వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యా రాణి లతో కలిసి జాతీయ రహదారులు, రెవెన్యూ, ఆర్ అండ్ బీ శాఖల అధికారులతో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణలో మంచిర్యాల నుండి భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్ జిల్లాల మీదుగా ఖమ్మం నుండి విజయవాడ వరకూ (నాగపూర్ -విజయవాడ) నిర్మించే 163జి గ్రీన్ ఫీల్డ్ ఎకానమిక్ కారిడార్ లో భాగంగా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఇప్పటి వరకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియ, రైతులకు పరిహారం చెల్లింపులు, తదితర అంశాలపై జాతీయ రహదారుల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన మాట్లాడుతూ 2వ, దశ ప్రాజెక్ట్ లో భాగంగా హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి పరిధిలో జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ ను త్వరగా పూర్తి



చేయాలన్నారు. భూసేకరణ కింద భూములు ఇచ్చిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సరస్వతి పుష్కరాల తరువాత భూసేకరణ పనులను మరింత వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. భూసేకరణ పెండింగ్ లో ఉన్న ప్రాంతాల రైతులతో ఆర్బిట్రేషన్ నిర్వహించి పరిహారం చెల్లింపునకు చర్యలు చేపట్టాలన్నారు. భూసేకరణలో భాగంగా రైతులతో అధికారులు మాట్లాడి పరిహారం చెల్లించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల శాఖ వరంగల్, ఖమ్మం ప్రాజెక్టు డైరెక్టర్లు దుర్గాప్రసాద్, దివ్య, ఆర్ అండ్ బీ ఎస్ ఈ నాగేంద్ర రావు, ఈఈ సురేష్ బాబు, ఆర్డీవోలు ఎన్. రవి, ఉమారాణి, సత్యపాల్ రెడ్డి రాథోడ్ రమేష్, నారాయణ, తహసీల్దార్లు, జాతీయ రహదారుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యాసంగి ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు

**- తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ**

**హనుమకొండ/మే 9(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ ఆదేశానుసారంగా హనుమకొండ జిల్లాలో యాసంగి ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయటం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.
1). హనుమకొండ జిల్లాలో 157200 మెట్రిక్ టన్నుల ధాన్యము కొనుగోలు చేయుటకు టార్గెట్ తీసుకోవడం.
2). జిల్లాలో 157 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం.
3). 157 కొనుగోలు కేంద్రాలకు ఇప్పటి వరకు 22.0 లక్షల గోనె సంచులు అందించడం.
4),157 కొనుగోలు కేంద్రాల ద్వారా 66236.280 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 43 రైస్ మిల్లులకు రవాణా చేయడం.
5). కొనుగోలు కేంద్రాల వారు 47925.88 మెట్రిక్ టన్నుల ధాన్యమును ఆన్లైన్ లో టాబ్ ఎంట్రీ చేశారు.
6). కొనుగోలు కేంద్రాల వారు ఆన్లైన్ లో టాబ్ ఎంట్రీ చేసిన 10083 రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం విలువ 111.09 కోట్లు.
7). ఇప్పటి వరకు 8926 రైతుల బ్యాంకు అకౌంట్ కి 98.67 కోట్లు జమ చేయడం.
8). మిగతా ధాన్యం కొనుగోలు చేయుటకు కావలిసిన గోనె సంచులు సరఫరా చేయుటకు జిల్లాలో అందుబాటులో ఉన్నాయి.
9).కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్నీ చర్యలు తీసుకోవడం.
10). తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ హైదరాబాద్ వారు ఇచ్చిన వాతావరణ సూచనలు కొనుగోలు కేంద్రాల, రైతుల వారీగా తెలియచేస్తూ ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోని ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ప్రకటన ద్వారా వెల్లడించారు. హనుమకొండ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందని సూచించారు.

# లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

**వరంగల్/మే 9(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ (తాలిమ్) నుండి లైసెన్స్‌సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు, తెలంగాణలోని అన్ని మీ సేవ కేంద్రాలలో లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మొత్తం 50 పని దినాలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

**అభ్యర్థుల అర్హతలు:**

ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండాలి) కనీసం 60 శాతం మార్కులతో

- ఐటీఐ (డ్రాఫ్ట్స్ మెన్ (సివిల్)
- డిప్లొమా (సివిల్)
- బి.టెక్ (సివిల్)

లేదా ఇతర సమానమైన అర్హత

**దరఖాస్తు విధానం:**

దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్ 2025 మే 5 నుండి మే 17 వరకు మీ సేవా కేంద్రాల ద్వారా మాత్రమే రూ. 100 చెల్లించి పొందవచ్చున్నారు. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: 17.05.2025 (మీ సేవ కేంద్రాల్లో మాత్రమే)

**ఫీజు వివరాలు :**

OC అభ్యర్థులకు రూ. 10,000/-
BC అభ్యర్థులకు రూ. 5,000/-
SC/ST అభ్యర్థులకు రూ. 2,500/-

లైసెన్స్ కలిగిన సర్వేయర్లుగా మారేందుకు ఇదొక సువర్ణ అవకాశమని అన్నారు. అర్హత కలిగినటువంటి అభ్యర్థులు, తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మానేజ్మెంట్ నుండి విడుదల అయినటువంటి ఈ నోటిఫికేషన్ సద్వినియోగ పరుచుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9704443476, 9398987337 నంబర్లకు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

# నాలుగు నెలల్లో యాతాలకుంట టన్నెల్ పూర్తి చేయాలి

## -ఈ సంవత్సరమే సీతారామ ద్వారా సాగునీరు సరఫరా అందించాలి
## -యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించి, అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల





**ఖమ్మం ఉమ్మడి భద్రది జిల్లా/మే9(జర్నలిస్ట్ వార్త):** సీతారామ ఎత్తిపోతల పథకం యాతాలకుంట టన్నెల్ పనులు 4 నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సత్తుపల్లి మండలం యాతాలకుంటలో సీతారామ ప్రాజెక్టు క్రింద నిర్మిస్తున్న యాతలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ లు ముజమ్మిల్ ఖాన్, జితేష్ వి. పాటిల్ లు, అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యే లు జారే ఆదినారాయణ, మట్టా రాగమయి లతో కలిసి, సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా మెయిన్ కెనాల్, 3 పంప్ హౌస్ లు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని, రాజీవ్ లింక్ కెనాల్ ఏర్పాటు చేసుకొని రాబోయే వానాకాలం దుమ్ముగూడెం ఆనకట్టకు గోదావరి నీరు రాగానే వైరా ప్రాజెక్టుకు, పినపాక నియోజకవర్గం తుమ్మలపల్లి వద్ద మారేడుపాక ఎత్తిపోతల పథకం ప్రారంభించి 25 వేల ఎకరాల ఆయకట్టు, కొత్తగూడెం నియోజకవర్గంలో యూటిలు ఏర్పాటు చేసుకొని అన్ని చెరువులకు నీళ్ళు వదిలేటట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ 1.8 కిలోమీటర్లకు గాను 1.2 కిలో మీటర్లు పూర్తయిందని, పెండింగ్ ఉన్న 600 మీటర్ల పనులు 4 నెలల్లో పూర్తి చేయాలని, అవసరమైతే మరో నిచ్చెన పెట్టుకోవాలని, అప్పటి లోపు అవసరమైన అక్వాడెట్ లు, ఇతర నిర్మాణాలు పూర్తి చేయాలని అన్నారు. ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన భూ సేకరణ చేపట్టాలని అన్నారు. వానాకాలం పంట సమయంలో గోదావరి జలాలు రైతులకు ఉపయోగపడాలని, ప్రభుత్వం రాజీవ్ కెనాల్, యాతాలకుంటపై చేసిన ఖర్చు సద్వినియోగం కావాలని అన్నారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలు సస్యశ్యామలం కావాలనే ఆకాంక్షతో ఈ ప్రాజెక్టు చేపట్టామని, దీనిని పూర్తి చేయాలని అన్నారు. సత్తుపల్లి, పినపాక, మధిర, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఈ సంవత్సరమే సాగునీరు అందాలని అన్నారు. వైరా ప్రాజెక్టు క్రింద లక్ష 30 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అన్నారు. నాగార్జునసాగర్ నీళ్ల రాకపోయినా రైతులకు ఇక ఇబ్బంది ఉండదని అన్నారు. సీతారామ ప్రధాన కాలువ శుభ్రం చేయాలని, నీరు వదిలితే త్వరగా వైరా ప్రాజెక్టులోకి నీళ్లు వెళ్లేలా చూసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి సమస్యలు వచ్చిన కలెక్టర్ దృష్టికి తీసుకొని పోవాలని అన్నారు. ప్రతి సమస్య వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అటవీ అభ్యంతరాలు, భూసేకరణ, లీగల్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్రిగేషన్ సిఇ ఏ. శ్రీనివాస రెడ్డి, ఎస్ఇ ఎస్. శ్రీనివాస రెడ్డి, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాసా చారి, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా రైతులను
# నిలువునా దోచుకుంటున్న మిల్లర్లు



**సత్తుపల్లి/మే9(జర్నలిస్ట్ వార్త):** సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా రైతులను నిలువునా దోచుకుంటున్న మిల్లర్లపై అధికారయంత్రాంగ చర్యలు తీసుకువాలని సత్తుపల్లి నియోజకవర్గ రైతులు కోరుతున్నారు. ఆరుగాలం వ్యయ ప్రయాసల పడుతూ కాలానికి ఎదురీదుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్న పండించిన ధాన్యాన్ని నెలల తరబడి ధాన్యం సేకరించకుండా రైతాంగాన్ని వేచి ఉండేలా చేస్తూ వారి మనోధైర్యాన్ని దెబ్బతీయటమే కాకుండా తరుగు వున్నది తూర్పాల పట్టాలని మిషన్ లు సైతం పెట్టుకోమని చెప్పి రైతులకు 4 -5 వేలు అదనపు ఖర్చు అయిన తర్వాత కూడా తీరా లారీకి లోడ్ ఎత్తే ముందు క్వింటాకు 5 కేజీలు ఇస్తే తప్ప మీ ధాన్యాన్ని తీసుకెళ్లమంటూ మిల్లర్లు కొర్రీలు పెడుతుండటంతో దిక్కుతోచని స్థితిలో వేంసూర్ మండలం మర్లపాడు రైతాంగం. అంతే కాకుండా ధాన్యం కటింగ్ కాకపోయినా కూడా ఏదో ఒక వంకలు పెడుతున్నారని తక్షణమే కలెక్టర్ స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధినిరోధక టీకాలు



**వర్ధన్నపేట/మే 9(జర్నలిస్ట్ వార్త):** పశువులకు గాలికుంటు వ్యాధినిరోధక టీకాలు తప్పు కుండా వేయించాలని శుక్రవారం రాష్ట్ర వెటర్నరి బయోలజికల్ రిసెర్చ్ ఇన్స్ ట్యూట్ ఉప సంచాలకులు డా: విజయ ప్రవీగో, జిల్లా పశువైద్యాధికారి డా: బాలక్రిష్ణ, అనిమల్ డిసీజ్ డయాగ్నోస్టిక్ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగమణి సూచించారు. వర్ధన్నపేట మండలం జగ్గిపేట, భారత గోశాల నందు శుక్రవారం చీకాలు- పశువులకు ఉచిత గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ప్రతి ఆరు (6) నెలలకు ఒక్కోసారి పశువులకు గాలికుంటు, వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని పాడి రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మండల వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. గాలికుంటు టీకాల కార్యక్రమం ఈనెల 15వ, తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## కోట గుళ్ళు గోశాల గోమాతలకు
# దానా బస్తాల వితరణ



**గణపురం/మే9(జర్నలిస్ట్ వార్త):** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల గోశాల గోమాతలకు రేగొండ మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన మాడుగుల భాగ్యలక్ష్మి తిరుపతి రెడ్డి దంపతులు శుక్రవారం దాన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి తిరుపతి రెడ్డి దంపతులు స్వామివారికి అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలు అందించారు. గోశాల గోమాతలకు దాన బస్తాలను అందజేసిన దంపతులకు కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి





**రాయపర్తి/మే9(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని పానీష్ తండా గ్రామ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు భూక్య బిక్షపతి కూతురు, తేట్టె కుంట తండా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు విష్ణు కళ్యాణ్ -ప్రవళికల వివాహ వేడుకలు శుక్రవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మునావత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు బద్దం వేణు గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ భద్రు నాయక్, సోషల్ మీడియా నాయకులు అశ్రఫ్ పాషా, చందు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానంతో దాతలుగా నిలిచిన కానిస్టేబుళ్ళు

## - అభినందించిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్/మే 9(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మూర్ రిజర్వ్ విభాగంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కన్నె రాజు అలియాస్ స్విమ్మర్ రాజు, కెయుసి కానిస్టేబుల్ రవీందర్ లను శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు. వరల్డ్ రెడ్ క్రాస్ దినోత్సవం పురస్కరించుకొని సుబేదారిలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఏర్పాటు చేసిన రక్త దాన కార్యక్రమంలో కానిస్టేబుల్ కన్నె రాజు 37వ, సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కానిస్టేబుల్ రవీందర్ 18 సార్లు రక్త దానం చేసినట్లుగా రెడ్ క్రాస్ సంస్థ కార్యవర్గ ప్రతినిధులు ముఖ్య అతిధి వరంగల్ పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకరావడంతో కన్నె రాజు, రవీందర్ లను వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇరువురు కానిస్టేబుళ్లకు సర్టిఫికెట్లను అందజేశారు. రాజు, రవీందర్ లను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ముఖ్యంగా ఏప్రిల్, మే సమయంలో రక్తం కొరత ఏర్పడుతుందని అన్నారు. అందువల్ల రక్తం కొరతను ఆదిగమించేందుకు, యువత రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

# ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## - ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్య. - డిసిఇబి కార్యదర్శి గారే కృష్ణమూర్తి



**రాయపర్తి/మే9(జర్నలిస్ట్ వార్త):** ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చి దిద్దడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్య లభిస్తుందని డిసిఇబి కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయుడు గారే కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఐకేపీ సెంటర్ లో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లో ఉచిత విద్యతో పాటు పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. కార్పొరేటర్ స్థాయిలో విద్యార్థులకు ప్రభుత్వము సకల సదుపాయాలను అందిస్తుందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని రక్షిత 562/600 మార్కులతో జిల్లాలోనే మొదటి ర్యాంక్ సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి సునీత, ఎస్వీబీ శర్మ, రోజా రాణి, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్, ఆర్ సురేందర్, ఎన్ రాధా, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధానికి నేను సిద్ధం

## యుద్ధం తీవ్రతరమైతే పాకిస్థాన్ పతనం ఖాయం
## నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్



**హైదరాబాద్: హైదరాబాద్: మే 9(జర్నలిస్ట్ వార్త):** భారత్ ఎపాకిస్థాన్ ల మధ్య యుద్ధ వాతావరణంలో తన అవసరమని భావిస్తే యుద్ధంలో పాల్గొనడానికి తాను సిద్ధంగా ఉన్నానని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. భారత వైమానిక దళంలోని పనిచేసిన తాను మిగ్ 23 వంటి యుద్ధ విమానాలు నడిపిన ఫైటర్ పైలెట్‌గా పనిచేసిన అనుభవం తనకు ఉందని ఆయన తెలిపారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా పలు అంశాలనుల ఆయన మీడియాతో పంచుకున్నారు. తాను 16 ఏండ్లకే డిఫెన్స్ లోకి వెళ్లానని, 1982లో మిగ్ 21 ఫైటర్ ఫైలెట్ గా పని చేశానని, ఆ తర్వాత మిగ్ 23 అత్యాధునిక ఫ్లైట్ కు పని చేశానని తెలిపారు. శబ్ద వేగానికి 2.5 రేట్లు ఎక్కువ వేగంతో మిగ్ 23 ఫ్లయింగ్ అవుతుందన్నారు. తాను రక్షణరంగంలో ఉన్నప్పుడు ఉత్తర్ లే, శ్రీనగర్, అమృత్ సర్ లో పని చేశానని, చాలా చిన్న వయస్సులో 20 ఏళ్లకే ఫైటర్ పైలెట్ గా పని చేశానని వెల్లడించారు. ఆక్రమిత కాశ్మీర్‌ను ఇండియా ఆధీనంలోకి వస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారమని ఆయన చెప్పారు. యుద్ధం కొనసాగితే పాకిస్తాన్ పతనం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. పాకిస్తాన్ జమ్మూపై చేసిన దాడికి ఇండియన్ ఆర్మీ ప్రతిదాడి చేయడం సరైన చర్యగా అభివర్ణించారు. గత ఏప్రిల్ 22న పాకిస్తాన్ ప్రేరేపిత చర్య చాలా దుర్మార్గమని, మతం పేరు అడిగి మరీ చంపడం దారుణమన్నారు. పాకిస్తాన్ నిర్వాకానికి బుద్ధి చెప్పడం సరైన చర్యగా తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ యుద్ధ విమానాలు, కామికసేన్ డ్రోన్ లు పని చేశాయని తెలిపారు. కాశ్మీర్ విషయంలో ఒక చర్య జరిగితే తప్ప రెండు దేశాల మధ్య సమస్య పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు.

# భారత్-పాక్ ఉద్రిక్తతల మధ్య అందాల పోటీలు

## భారీగా భద్రతా ఏర్పాట్లు చేసిన తెలంగాణ ప్రభుత్వం

## హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో గస్తీ తీవ్రతరం

హైదరాబాద్:**మే 9(జర్నలిస్ట్ వార్త):**



భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలకు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. అలాగే నగరంతో పాటు విమానాశ్రయం, పోటీలు నిర్వహించే ప్రాంతాల్లో భద్రతనుకట్టుదిట్టం చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో పోటీల నిర్వాహక సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఒత్తిడికి గురవుతున్న వేల రాష్ట్ర ప్రభుత్వం ఆయా దేశాల నుంచి వచ్చిన వారందరి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. అయితే, హైదరాబాద్‌లోని వ్యూహాత్మక సంస్థల భద్రత, సామాన్య ప్రజల రక్షణకు అత్యంత ప్రాధాన్యమివ్వాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో మిస్ వరల్డ్ పోటీలకు మూడు వారాలపాటు- పూర్తిస్థాయి భద్రత పెద్ద సవాల్కానుంది. ఈ నేపథ్యంలో కేంద్రం సూచనల మేరకు నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గురువారం నాటి పరిస్థితులను చూసి పాకిస్థాన్‌లో ఉన్న అమెరికా పౌరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. దాంతో మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సైతం పోటీలను కొనసాగిస్తే తలెత్తే సమస్యలపై ఆలోచిస్తోందని, అంతర్జాతీయంగా అభిప్రాయాలను సేకరిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వంతోనూ ఎప్పటికప్పుడు చర్చిస్తోందని తెలిసింది. మిస్ వరల్డ్ వేడుకలకు 116 దేశాల నుంచి అందాల భామలు రావాల్సి ఉండగా.. గురువారం సాయంత్రానికి 109 మంది వచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇంకా స్పాన్సరర్లు, అంతర్జాతీయ మీడియా రావాల్సి ఉంది. కొందరు పోటీల మధ్యలో చేరుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పుడు హఠాత్తుగా విమానాల రూట్ల మార్పు, సర్వీసుల రద్దు ప్రభావం సైతం అందాల పోటీలపై ఉంటుందని భావిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 10న ప్రారంభ వేడుకల అనంతరం యువతులంతా 12వ తేదీ నుంచి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, హైదరాబాద్‌లోని చార్మినార్, లాడ్‌బజార్, వరంగల్‌లోని వేయిస్తంభాల గుడి, రామప్ప ఆలయం, యాదగిరిగుట్ట, పోచంపల్లి, మహబూబ్‌నగర్‌లలో పర్యటించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ప్రాంతాల్లో అందాల భామల పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. ఇప్పటికే సిఎం రేవంత్ పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షించి ఆదేశాలు ఇచ్చారు.

# యుద్ధం సమస్యకు పరిష్కారం కాదు

## దౌత్యమార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలి

## ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్

న్యూఢిల్లీ,:**మే 9(జర్నలిస్ట్ వార్త):** ఏ సమస్యకు యుద్ధం పరిష్కారం కాదని, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ ఎఐఎంపిఎల్‌బి శుక్రవారం పేర్కొంది. భారత్-పాక్ సరిహద్దుల్లో పెరుగుతున్న ఉద్రిక్తతపై బోర్డు ఆందోళన వ్యక్తం చేసింది. ఉగ్రవాదం మరియు అమాయక పౌరుల హత్య తీవ్ర ఆందోళన కలిగించే అంశమని పేర్కొంది. ఇస్లామిక్ బోధనలలో, ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన గ్రంథాలలో, మానవ విలువలలో ఉగ్రవాదానికి స్థానం లేదని పేర్కొంది. ఇరు దేశాలు ద్వైపాక్షిక చర్చలు, ఇతర దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేసింది. యుద్ధం ఏ సమస్యకు పరిష్కారం కాదన్నది కూడా వాస్తవమని పేర్కొంది. దేశం, ప్రజల రక్షణ మరియు వారి రక్షణ కోసం తీసుకునే ప్రతి చర్యకు ఎఐఎంపిఎల్‌బి మద్దతు ఇస్తుందని ప్రకటించింది. క్లిష్టమైన సమయాల్లో ప్రజలు, రాజకీయ పార్టీలు, సాయుధ దళాలు మరియు ప్రభుత్వం కలిసి రావాలని స్పష్టం చేసినట్లు- బోర్డు పేర్కొంది. భారత్, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలపై ఎఐఎంపిఎల్‌బి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. గురువారం జరిగిన ఆఫీస్ బేరర్ల ప్రత్యేక ఆన్‌లైన్ సమావేశంలో ఈ తీర్మానాన్ని ఆమోదించినట్లు- తెలిపింది. తమ 'సేవ్ వక్ఫ్ క్యాంపెయిన్'ను యథావిధిగా కొనసాగిస్తామని, అయితే ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా బహిరంగ సమావేశాలు , కార్యక్రమాలను మే 16 వరకు వాయిదా వేస్తున్నట్లు- తెలిపింది.

## 400 డ్రోన్‌లతో పాకిస్థాన్ దాడి...

# పౌర విమానాలను రక్షణ కవచంగా వాడుకుంది

**భారత్‌లోని 36 సరిహద్దు ప్రాంతాలపై పాకిస్థాన్ డ్రోన్ల దాడి**

**300-400 డ్రోన్లతో గురువారం రాత్రి దాడులకు పాల్పడిన పాక్**

**భారత సైనిక స్థావరాలు, ప్రార్థనా మందిరాలే లక్ష్యంగా దాడులు**

**పౌర విమానాలను రక్షణ కవచంగా పాక్ వాడుతోందని భారత్ ఆరోపణ**




**మే 9(జర్నలిస్ట్ వార్త):**
భారత్‌లోని కీలక సరిహద్దు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని పాకిస్థాన్ గురువారం రాత్రి భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి పాల్పడిందని భారత ప్రభుత్వం వెల్లడించింది. జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని సుమారు 36 ప్రాంతాలపై 300 నుంచి 400 డ్రోన్లను ప్రయోగించిందని భారత సైన్యం తెలిపింది. ఈ దాడుల వెనుక భారత గగనతల రక్షణ వ్యవస్థలను పరీక్షించడం, నిఘా సమాచారాన్ని సేకరించడమే పాక్ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంది.'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఈ సంచలన విషయాలను తెలిపారు. గురువారం రాత్రి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు దిగి, నియంత్రణ రేఖ వెంబడి ఉల్లంఘనలకు పాల్పడుతూ భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిందని వారు వివరించారు. పాక్ వైపు నుంచి వచ్చిన అనేక డ్రోన్లను భారత బలగాలు కూల్చివేశాయని, ఈ ఘటనల్లో పలువురు గాయపడ్డారని వారు పేర్కొన్నారు. పంజాబ్ సరిహద్దుల్లో పూర్తి అప్రమత్తత కొనసాగుతోందని, పాక్ దాడులను భారత వాయుసేన సమర్థంగా అడ్డుకుందని తెలిపారు. దాడుల కోసం టర్కీకి చెందిన 'ఆసిస్‌గార్డ్ సోంగర్' రకం డ్రోన్లను పాకిస్థాన్ ఉపయోగించినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసిందన్నారు.

ఈ దాడుల సందర్భంగా పాకిస్థాన్ తన పౌర విమానాలను రక్షణ కవచాలుగా వాడుకుందని భారత రక్షణ శాఖ ప్రతినిధులు తీవ్ర ఆరోపణలు చేశారు. పాకిస్థాన్ డ్రోన్, క్షిపణి దాడులు ప్రారంభించినప్పటికీ, కరాచీ, లాహోర్ మధ్య పౌర విమాన సర్వీసులను నిలిపివేయలేదని వారు తెలిపారు. తమ దాడులకు భారత్ నుంచి ప్రతిస్పందన వస్తుందని తెలిసి కూడా, పౌర విమానాలను అడ్డుపెట్టుకోవడం ద్వారా పాకిస్థాన్ అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించిందని అన్నారు.ఇది భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలో ప్రయాణించే విమానాలతో పాటు, పాకిస్థాన్‌లోని పౌర విమానాలకు కూడా సురక్షితం కాదని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, పాకిస్థాన్ ప్రార్థనా మందిరాలను కూడా లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందని, ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు.
అంతర్జాతీయ విమానయాన నిబంధనలను, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని భారత వాయుసేన పూర్తి సంయమనంతో వ్యవహరించిందని కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు స్పష్టం చేశారు. పాకిస్థాన్ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇలాంటి కవ్వింపు చర్యలను భారత్ ఉపేక్షించబోదని వారు హెచ్చరించారు

# హైదరాబాద్‌లో సిట్ దాడులు

## ఎపి మద్యం కుంభకోసం కేసు -నిందితుల ఇల్లు సోదా..నోటీసులు

హైదరాబాద్:**మే 9(జర్నలిస్ట్ వార్త):**



ఏపీ మద్యం కుంభకోణం కేసులో సిట్ దూకుడు పెంచింది. ఒకేసారి హైదరాబాద్‌లో మెరుపు దాడులు చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ కార్యదర్శి ధనుంజయ్ రెడ్డి, మాజీ పీఏ కృష్ణమోహన్ రెడ్డి, ఆయన కుమారుడు రోహిత్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప ఇళ్లు, కార్యాలయాలపై సిట్ అధికారులు దాడులు చేశారు. హైదరాబాద్‌లో ఈ కేసు నిందితులైన కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్ప నివాసాలు, కార్యాలయాల కు వెళ్లిన సిట్ అధికారులు అక్కడ నోటీసులు జారీ చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు విచారణ కోసం విజయవాడలోని సిట్ కార్యాలయానికి రావాలని తెలిపారు. వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో ముడుపుల రూపంలో రూ.3,200 కోట్లు- చేతులు మారినట్లు- సిట్ ప్రాథమిక ఆధారాలు సేకరించింది. ఈ కేసులో ఇప్పటికే అరెరెస్టయిన కీలక నిందితులు రాజ్ కెసిరెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డితో పాటు- మరికొందరి స్టేట్‌మెంట్ల ఆధారంగానూ సిట్ సమాచారం సేకరించింది. పాలసీ రూపకల్పన, ఏ స్థాయిలో ఏ అధికారిని నియమించాలనే విషయంలో ధనుంజయరెడ్డి కీలక పాత్ర పోషించారని సిట్ చెబుతోంది. మద్యం పాలసీ రూపకల్పన, సరఫరాదారుల నుంచి ముడుపుల వసూళ్లు, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో వీరి పాత్ర ఉందని భావిస్తోంది. పర్సంటేజ్‌ల గురించి చర్చించేందుకు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి మద్యం కంపెనీ యజమానులతో హైదరాబాద్, తాడేపల్లిలో పలుమార్లు సమావేశం అయ్యారని, వసూలు చేసిన సొమ్మును షెల్ కంపెనీల ద్వారా మళ్లించారని సిట్ దర్యాప్తులో ఆధారాలు సేకరించింది. ఆ సొమ్ము అంతిమంగా ఎవరి ఖాతాకు చేరిందనే విషయం దర్యాప్తులో తేలాల్సి ఉంది. బాలాజీ గోవిందప్ప అందుబాటులో లేకపోవడంతో ఆయన సతీమణికి సిట్ అధికారులు నోటీ-సులు ఇచ్చారు. విచారణకు హాజరు కావాలని నోటీ-సుల్లో సిట్ అధికారులు పేర్కొన్నారు. అలాగే కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇంట్లో లేకపోవడంతో ఆయన కుమారుడు రోహిత్ రెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసులు జారీ చేసి వారి ఇళ్లల్లో సిట్ ప్రత్యేక అధికారులు దాడులు ప్రారంభించారు. ఒకేసారి హైదరాబాద్‌లో ముగ్గురు కీలక నిందితుల ఇళ్లపై సిట్ అధికారులు దాడులు చేశారు.గత వైసీపీ ప్రభుత్వంలో భారీ మద్యం కుంభకోణం వెలుగుచూసింది. కూటమి ప్రభుత్వం ఈ స్కాంలో ఉన్న వ్యక్తులపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఈ కేసును సిట్‌కు అప్పగించింది. సిట్ అధికారులు ఈ కేసును ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికే ఈ కేసులో రాజ్ కసిరెడ్డితో పాటు- మరికొంతమందిని అధికారులు అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ క్రమంలోనే సిట్ అధికారులు హైదరాబాద్‌లో సోదాలు జరుపుతున్నారు. మే 11వ తేదీ తమ ఎదుట విచారణకు హాజరు కావాలంటూ సిట్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. . లిక్కర్ స్కాంలో కృష్ణమోహన్ రెడ్డి కీలకంగా ఉన్నారు. విచారణకు హాజరుకాకుండా కృష్ణమోహన్ రెడ్డి తప్పించుకు తిరుగుతున్నారని అధికారులు తెలిపారు. ముందస్తు బెయిల్ కోసం కృష్ణమోహన్ రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా కృష్ణమోహన్ రెడ్డి సుప్రీంకోర్టులో

# పేరంటాలు కోరిక తీర్చిన పవన్

## పార్టీ కార్యాలయంలో కలసి భోజనం - చీరతో పాటు లక్ష నగదు బహూకారణ







అమరావతి,**మే 9(జర్నలిస్ట్ వార్త):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. తన వీరాభిమాని అయిన 96 ఏళ్ల వృద్ధురాలు పోతుల పేరంటాలుతో కలిసి భోజనం చేశారు. పేరంటాలు కోరిక మేరకు శుక్రవారం జనసేన క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించి.. ఆవిడతో కలిసి పవన్ భోజనం చేశారు. అంతేకాదు చీర, లక్ష రూపాయల నగదును కూడా అందించారు. డిప్యూటీ- సీఎంను కలవడమే కాకూండా.. భోజనం చేయడంతో పేరంటాలు సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. పవన్ కల్యాణ్‌తో పేరంటాలు భోజనం వీడియోస్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొత్త ఇసుకపల్లికి చెందిన పోతుల పేరంటాలు.. పవన్ కల్యాణ్, జనసేన పార్టీకి వీరాభిమాని. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ తెలిసిందే. పవన్ మీది అభిమానంతో ఆయన విజయం సాధించాలని గ్రామంలోని వేగులమ్మ తల్లికి పేరంటాలు పొర్లు దండాలు పెట్టారు. పవన్ గెలిస్తే అమ్మవారికి గరగ చేయించి సమర్పిస్తానని మొక్కుకున్నారు. పవన్ భారీ మెజారిటీతో గెలవడంతో.. తనకు వచ్చే పింఛను సొమ్ములో రూ.2,500 చొప్పున పోగు చేసింది. 2025 మే నెలతో రూ.27 వేలు కాగా.. ఆ సొమ్ముతో అమ్మవారికి గరగ చేయించి సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా పవన్‌తో కలిసి భోజనం చేయాలనుందని చెప్పారు. విషయం తెలుకున్న డిప్యూటీ సీఎం ఈరోజు పేరంటాలును క్యాంప్ కార్యాలయానికి ఆహ్వానించారు. ఆమెతో కలసి భోజనం చేయడంతో పాటు, ఆమెను అక్కున చేర్చుకుని తన ప్రేమను చాటారు.

# పేదరికం లేని సమాజమే నా లక్ష్యం

## పేదవారు పైకి వచ్చేవరకు పోరాడుతా - అభివృద్ధి చెందిన వారు పేదలకు సాయపడాలి

## పేదరికం చదువుకు అడ్డం కారాదన్నదే లక్ష్యం -హంద్రీనీవా పనులను పరిశీలించిన చంద్రబాబు

అనంతపురం,**మే 9(జర్నలిస్ట్ వార్త):**



పేదవాడు ఆకలితో ఉంటే సమాజానికి మంచిది కాదని ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించడమే తమ ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు.
పేదరికం వల్ల ఎవరికీ చదువుకోలేని పరిస్థితి రాకూడదని అన్నారు. అండదండలు లేక ఎంతో మంది యువత కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో హంద్రీనీవా పనులను పరిశీలించిన సీఎం.. అక్కడ జరుగుతున్న పనుల తీరును గమనించారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన సభలో మాట్లాడుతూ.. సమాజాన్ని ఆసరా చేసుకొని బాగుపడిన వారు ఆలోచించాలి. ఇంకా ఎంతోమంది పేదరికంలో ఉన్నారు. పేదవాళ్లను పైకి తీసుకొచ్చేందుకు తమ పరిధిలో చేయూత ఇవ్వాలి. కింద స్థాయిలో ఉన్న 20శాతం మందికి అండగా నిలుద్దాం. సూచనలు, సలహాలే కాదు.. అవసరమైతే కాస్త డబ్బు ఖర్చు చేద్దాం. ఆర్థిక అసమానతలు తగ్గించడమే మా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. పేదవారి జీవితాల్లో వెలుగులు తెచ్చేవరకు వారితోనే ఉంటానని చంద్రబాబు చెప్పారు. కష్టపడి చదువుకుని పైకి వచ్చినవారు ఎంతో మంది ఉన్నారని, సరైన సమయంలో సరైన గైడెన్స్ ఉంటేనే జీవితంలో పైకి రాగలమని తెలియజేశారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలు అందుబాటులోకి తెచ్చామని, మనం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. టెక్నాలజీ సరిగా వాడుకుంటే మనం ముందుకెళ్లగలమన్నారు. మన భూముల్లో ఏయే పంటల పండుతాయో తెలుసుకునే టెక్నాలజీ వచ్చిందని, నేరాలు చేసి ఎవరూ తప్పించుకోలేరని, సిసి కెమెరాలు, డ్రోన్లు ఉన్నాయని చంద్రబాబు స్పష్టం చేశారు.
పేదవాడు ఆకలితో ఉంటే సమాజానికి మంచిది కాదు. వారి జీవితాల్లో వెలుగులు తెచ్చేవరకు మీతోనే ఉంటా. కష్టపడి చదువుకుని పైకి వచ్చినవారు ఎంతోమంది ఉన్నారు. సరైన సమయంలో సరైన గైడెన్స్ ఉంటేనే జీవితంలో పైకి రాగలం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలు అందుబాటులోకి తెచ్చాం. పనుల కోసం మీరు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. 2029 నాటికి పేదరికం లేని సమాజమే నా లక్ష్యం. ఆర్థిక అసమానతలను తగ్గిస్తాం. టె-క్నాలజీ సరిగా వాడుకుంటేనే మనం ముందుకెళ్లగలమని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్ వీర మరణం పట్ల సీఎం చంద్రబాబు సభలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురళీ నాయక్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. దేశాన్ని రక్షించగలిగిన సమర్థత ఉన్న నాయకుడు మోదీ ఒక్కరే. మన దేశం.. ఉగ్రవాదానికి ఎప్పటికీ వ్యతిరేకం. ప్రజాస్వామ్యంలో



ఉగ్రవాదానికి స్థానం లేదు. ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటులేదని మోదీ ఏనాడో చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదులను మట్టు-బెట్టిన ప్రభుత్వం కేంద్రంలో ఉంది. సరిహద్దుల్లో పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. దేశానికి సేవ చేసేందుకు యువత సైన్యంలో చేరుతున్నారు. సైన్యానికి మనమంతా అండగా ఉంటూ.. వారి పోరాటానికి మద్దతు ఇవ్వాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు,పయ్యావుల కేశవ్, స్థానిక ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎంకుగనంగాస్వాగతం పలికారు.

# ఐపీఎల్ నిరవధిక వాయిదా..!

## ఉద్రిక్త పరిస్థితుల్లో బీసీసీఐ కీలక నిర్ణయం



ఐపీఎల్ 18వ సీజన్ నిరవధికంగా వాయిదా వేసినట్లు బీసీసీఐ ప్రకటించింది. భారత్ పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల్లో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ తెలిపింది. ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారుతుంది. ఆటగాళ్ల భద్రత విషయంలో రాజీపడకూడ్దన్న ఉద్దేశ్యంతోనే వాయిదా వేసినట్లు బీసీసీఐ అధికారులు తెలిపారు. ఓ వైపు దేశం యుద్ధం చేస్తుంటే..ఇలాంటి సమయంలో క్రికెట్ మ్యాచులు నిర్వహించడం సరైంది కాదని వెల్లడించింది. ఇప్పటికే పంజాబ్, ఢిల్లీ, మ్యాచ్ భద్రతా కారణాలవల్ల మధ్యలోనే రద్దు చేసిన విషయం తెలిసిందే. నేడు లఖ్ నవూ, ఆర్సీబీ మధ్య లఖ్ నవూలోని ఏకనా స్టేడియంలో మ్యాచ్ జరగాల్సింది. టోర్నీని వాయిదా వేసినప్పటికీ ఎప్పుడు తిరిగి ప్రారంభిస్తారనేది మాత్రం బీసీసీఐ ఇంకా వెల్లడించలేదు. కాగా భారత్ పాక్ మధ్య ఉద్రిక్తత నేపథ్యంలో అందరూ ఊహించినట్లుగానే ఐపీఎల్ నిరవధికంగా వాయిదా పడింది. ధర్మశాలలో ఉన్న పంజాబ్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లను సిబ్బందిని అక్కడి నుంచి ఢిల్లీకి తరలించేందుకు మొదట ప్రత్యేక రైలును ఏర్పాటు చేసింది బీసీసీఐ. వందేభారత్ లో తరలించేందుకు రెడీ అయ్యింది. అయితే తాజా కథనాల ప్రకారం..ఆ రైలు వెళ్లేందుకు రైల్వేశాఖ అనుమతి లేకపోవడంతో పఠాన్ కోట్ మీదుగా వెళ్లాల్సిన నేపథ్యంలో రిస్క్ తీసుకోదలుచుకోలేదని రైల్వే వర్గాలు తెలిపాయి. దీంతో మరో విధంగా ఆటగాళ్లను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది బీసీసీఐ . బస్సుల్లోనే ఢిల్లీకి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం.

# అరుణ్ జైట్లీ స్టేడియానికి బాంబు బెదిరింపులు



భారత్, పాక్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దాయాది దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్కు శుక్రవారం ఉదయం అరుణ్ జైట్లీ స్టేడియాన్ని బాంబులు పెట్టి పేల్చివేస్తామని బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. దేశ రాజధానిలోని ఈ స్టేడియం ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి ఇది హోంగ్రౌండ్. ఐపీఎల్ టోర్నమెంట్‌ను ఒక వారం పాటు నిలిపివేయడానికి ముందు ఉన్న షెడ్యూల్ ప్రకారం.. మే 11న ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరగనున్న ఐపీఎల్ 2025 మ్యాచ్ కు ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది.డీడీసీఏ ఉన్నతాధికారి ఒకరు దీనిని ధ్రువీకరించారు. దీని గురించి ఢిల్లీ పోలీసులకు సమాచారం అందించామని ఆయన చెప్పారు. ఉదయం బెదిరింపు మెయిల్ రావడంతో ఢిల్లీ పోలీసులను సంప్రదించామని.. వారు స్టేడియాన్ని తనిఖీ చేశారని కూడా వెల్లడించారు. భారత్ అంతటా పాకిస్థాన్ కు విధేయులైన స్లీపర్ సెల్స్ ఉన్నాయని.. ఆపరేషన్ సిందూర్ కోసం వాటి యాక్టివేట్ చేస్తామని బెదిరింపు ఈ-మెయిల్‌లో ఉంది.ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారత్ తీసుకున్న సైనిక చర్య తర్వాత జాతీయ భద్రతా సమస్యలను పేర్కొంటూ బీసీసీఐ శుక్రవారం అధికారికంగా ఐపీఎల్‌ను వారం పాటు నిలిపివేసింది. ధర్మశాలలో జరిగిన పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌కు వైమానిక దాడి అంతరాయం కలిగించిన ఒక రోజు తర్వాత ఈ నిర్ణయం వచ్చింది. ఐపీఎల్ ఇప్పుడు ఒక వారం పాటు వాయిదా పడింది. పరిస్థితిని బట్టి ఐపీఎల్ కొత్త షెడ్యూల్ ప్రకటించబడుతుంది. సరిహద్దులో ఉద్రిక్తత ఒక వారం కంటే ఎక్కువ కాలం కొనసాగితే.. జూన్ మొదటి వారంలో టీమిండియా ఇంగ్లాండ్ లో పర్యటించాల్సి ఉన్నందున బీసీసీఐ దానిని చాలా కాలం పాటు వాయిదా వేయాల్సి ఉంటుంది. ఆ పరిస్థితి ఏర్పడితే బోర్డు దృష్టి ఆగస్టు-సెప్టెంబర్ విండోపై ఉంటుంది.

# భారత్ దెబ్బకు బిచ్చమెత్తుకుంటోన్న పీసీబీ




భారత్‌తో శత్రుత్వం పెంచుకోవడం ద్వారా పాకిస్తాన్ పెద్ద తప్పు చేసింది. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద సంఘటన తర్వాత, మే 6, 7 తేదీల్లో రాత్రి పాకిస్తాన్‌లో ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను భారతదేశం ధ్వంసం చేసింది. అప్పటి నుంచి భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఈ ఉద్రిక్తత కారణంగా, మే 8న రావల్పిండిలో జరగాల్సిన పాకిస్తాన్ సూపర్ లీగ్ మ్యాచ్ రద్దు చేశారు. ఇది మాత్రమే కాదు, పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో పాల్గొనే విదేశీ ఆటగాళ్లందరూ కూడా భయాందోళనలో ఉన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే కొంతమంది విదేశీ ఆటగాళ్ళు తమ దేశానికి తిరిగి రావడం గురించి ఫ్రాంచైజీలతో ఇప్పటికే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితిలో, పిఎస్ఎల్ 10వ సీజన్ ఇప్పుడు రద్దు అయ్యే ప్రమాదం ఉంది. ఎందుకంటే పాకిస్తాన్ వైపు నుంచి నిరంతరం డ్రోన్ దాడులు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో, భారతదేశం ప్రతీకారం తీర్చుకుంటే, పిఎస్ఎల్ ఈ సీజన్ పూర్తి చేయడం కష్టం. ఎందుకంటే, పాకిస్తాన్‌లోని కొన్ని ప్రధాన స్టేడియాలు భారత సరిహద్దుకు చాలా దగ్గరగా ఉన్నాయి. ఇది జరిగితే పాకిస్తాన్ క్రికెట్ బోర్డు దివాళా తీస్తుంది. ఎందుకంటే, ఈ లీగ్ కారణంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు నిరంతరం నష్టాలను చవిచూస్తోంది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మాత్రమే కాదు, 6 జట్ల యజమానులు కూడా భారీ నష్టాలను చవిచూస్తారు. ఆడిట్ నివేదిక ప్రకారం, గత ఐదు సీజన్లలో పిఎస్ఎల్ నుంచి పీసీబీ భారీ నష్టాలను చవిచూస్తోంది . ఫ్రాంచైజీకి ఎక్కువ వాటా ఇవ్వడం వల్ల ఈ నష్టం సంభవించింది. ఆడిట్ నివేదిక ప్రకారం, పిఎస్ఎల్ ఫ్రాంచైజీలకు అధిక వాటాలు ఇవ్వడం వల్ల పాకిస్తాన్ క్రికెట్ బోర్డు రూ.1,637.977 మిలియన్ల నష్టాన్ని చవిచూసింది. పీసీబీ, ఫ్రాంచైజీ మధ్య 10 సంవత్సరాల ఒప్పందం ఉంది. 2025 లో 10 సంవత్సరాలు పూర్తయిన తర్వాత మాత్రమే ఈ ఒప్పందంలో మార్పులు చేయడానికి అనుమతి ఉంటుంది.

# రోహిత్ రిటైర్మెంట్ పై మౌనం వీడిన బీసీసీఐ!



టెస్ట్ క్రికెట్ నుండి రోహిత్ శర్మ ఆకస్మిక పదవీ విరమణపై బీసీసీఐ స్పష్టత ఇచ్చింది. జూన్ 20న ఇంగ్లాండ్‌లో ప్రారంభమయ్యే ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు రోహిత్ తన రిటైర్మెంట్ ప్రకటించగా, ఇది పూర్తిగా అతని వ్యక్తిగత నిర్ణయమేనని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించారు. బోర్డు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆటగాళ్లు తమ భవిష్యత్‌ను నిర్ణయించుకునే స్వేచ్ఛను కలిగి ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. రోహిత్ టెస్ట్ కెరీర్‌గురించి మాట్లాడుతూనే శుక్లా, అతని సహకారం అపారమైనదని కొనియాడారు. వన్డేలు ఇంకా కొనసాగించనున్న రోహిత్, భారత క్రికెట్‌కు తన అనుభవాన్ని అందించగలడని ఆశాభావం వ్యక్తం చేశారు.రోహిత్ శర్మ తన టెస్ట్ కెరీర్‌లో మిశ్రమ ఫలితాలు సాధించాడు. 67 టెస్టుల్లో అతను కొన్ని అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడినా, అవి స్థిరంగా కొనసాగలేకపోయాయి. ముంబై దేశీ క్రికెట్‌లో అద్భుత శతకాలు సాధించిన రోహిత్, అంతర్జాతీయంగా 2007లో అరంగేట్రం చేసినా టెస్ట్ కెప్టెన్‌గా 2013లో మాత్రమే అవకాశం లభించింది. ఆ తర్వాత కూడా టెస్ట్ ఫార్మాట్‌లో తన స్థానం నెమ్మదిగా స్థిరపరిచాడు. దేశీయ మైదానాల్లో రోహిత్ అసాధారణ ఆటతీరు కనబర్చినా, విదేశాల్లో అస్థిరత అతని కెరీర్‌ను వెంటాడింది. విశ్వవ్యాప్తంగా ఉన్న అభిమానులను తన అస్థిర ఆటతీరుతో నిరాశపరిచిన సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. కానీ, అతని సాంకేతిక నైపుణ్యం, శాంతమైన మనస్తత్వం, 'హిట్‌మ్యాన్'గా గెలుచుకున్న గౌరవం అతనిని చరిత్రలో ఒక ప్రత్యేక స్థానంలో నిలబెడతాయి.రోహిత్ రిటైర్మెంట్ తర్వాత, భారత టెస్ట్ కెప్టెన్సీ బాధ్యత ఎవరు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారింది. జస్ప్రీత్ బుమ్రా, కెఎల్ రాహుల్, శుభ్మాన్ గిల్ వంటి ఆటగాళ్లు కెప్టెన్సీ రేసులో ఉన్నారని తెలుస్తున్నా, ఇది పూర్తిగా సెలక్షన్ కమిటీ పరిధిలోనిదేనని శుక్లా స్పష్టం చేశారు. ఊహాగానాలకు ఆస్కారం లేదని ఆయన సూచించారు. రోహిత్ శర్మ తన టెస్ట్ కెరీర్‌తో భారత క్రికెట్‌కు అందించిన సేవలు, అతని ఆటలోని మేధస్సు, నాయకత్వ నైపుణ్యం సుదీర్ఘకాలం పాటు అభిమానుల మదిలో నిలిచిపోతాయి. అతను చూసిన ఎత్తులు, తట్టుకున్న దిగువలు, ఇవన్నీ కలిపి ఒక ఆత్మవిశ్వాసమైన ఆటగాడి పూర్తి చిత్రం తయారవుతుంది.

# పాక్‌కు యూఏఈ షాక్




దుబాయ్: భారత్‌తో యుద్ధం ప్రభావం పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)పైనా పడింది. స్వదేశీ, విదేశీ క్రికెటర్లు పోటీపడుతున్న ఈ లీగ్‌ను ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నట్టు పాక్ క్రికెట్ బోర్డు శుక్రవారం రాత్రి ప్రకటించింది. దేశ ప్రధాని షాబాజ్ షరీఫ్ ఆదేశాల మేరకు పీఎస్ఎల్‌ను వాయిదా వేయాలని నిర్ణయించుకున్నామని పీసీబీ తెలిపింది. అయితే, అంతకుముందు ఉదయం.. లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించనున్నట్టు పీసీబీ వెల్లడించింది. కానీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా విదేశీ క్రికెటర్లు లీగ్‌లో కొనసాగేందుకు విముఖత చూపడం, స్వదేశాలకు తరలించాలని కోరడంతో వాయిదా నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మరోవైపు, పీఎసఎల్ మ్యాచ్‌ల ఆతిథ్యానికి యూఏఈ క్రికెట్ బోర్డు (ఈసీబీ) కూడా విముఖత వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. యూఏఈలో ఇండో-పాక్ క్రికెట్ అభిమానులు భారీ సంఖ్యలో ఉంటారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పీఎస్ఎల్‌ను నిర్వహిస్తే ఫ్యాన్స్ మధ్య ఘర్షణలు, శాంతి భద్రతల సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని ఈసీబీ భావిస్తోందట. పైగా బీసీసీఐతో ఈసీబీకి బలమైన సంబంధాలు ఉండడంతో.. పీఎసఎల్‌కు నో చెప్పాలని అనుకొంటుందని సమాచారం.

# రక్షణ మంత్రిత్వ శాఖ గెజిట్ జారీ

పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో భారత సైన్యానికి సాయం అందించాలంటూ ప్రాదేశిక సైన్యానికి పిలుపు అందింది. ఈ మేరకు రక్షణ మంత్రిత్వ శాఖ గెజిట్ జారీ చేసింది. ప్రాదేశిక సైన్యం సేవలను ఉపయోగించుకునేందుకు భారత సైనిక అధ్యక్షుడికి పూర్తి అధికారం ఉందని చెప్పింది. సైన్యానికి అనుబంధంగా ఉంటూ ప్రాదేశిక సైన్యం చేయూత అందించనుంది.గతంలో కూడా సైన్యానికి ప్రాదేశిక సైనిక వర్గం సేవలు అందించింది. ఇప్పుడు కూడా సేవలు అందించబోతుంది. ఆపరేషన్ పరాక్రమ్, కార్గిల్ యుద్ధ సమయంలోనూ ప్రాదేశిక సైన్యం.. భారత సైనిక దళానికి సేవలు అందించింది. ఈ ప్రాదేశిక సైన్యంలో చాలా మంది ప్రముఖులు ఉన్నారు. లెఫ్టినెంట్ కల్నల్ హోదాలో టీమిండియా మాజీ కెప్టెన్‌లు మహేంద్ర సింగ్ ధోనీ, కపిల్ దేవ్

# భారత సైన్యం నుంచి ధోనీకి పిలుపు!

ఉండగా.. మాజీ కేంద్ర మంత్రి సచిన్ పైలెట్ కూడా ప్రాదేశిక సైన్యంలో కెప్టెన్ హోదాలో కొనసాగుతున్నారు. ప్రాదేశిక సైన్యం అనేది స్వచ్ఛంద పౌరులతో కూడిన సైనిక సంస్థ, వీరు దేశానికి అవసరమైనప్పుడు సేవ చేయడానికి శిక్షణ పొందుతారు.మహేంద్ర సింగ్ ధోనీకి 2011లో భారత ప్రాదేశిక సైన్యం గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాను ప్రదానం చేసింది. ఇది క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా దక్కింది. ధోనీ పారాట్రూపర్ శిక్షణ కూడా తీసుకున్నాడు. ఆ ట్రైనింగ్‌లో అర్హత కూడా సాధించాడు. 2019 వన్డే ప్రపంచకప్ పరాజయం అనంతరం.. ధోనీ తన బెటాలియన్‌తో కలిసి కాశ్మీర్ లోయలో దాదాపు 15 రోజుల పాటు పెట్రోలింగ్, గార్డ్, పోస్ట్ డ్యూటీ వంటి విధుల్లో పాల్గొన్నాడు. ఇది అతని అభ్యర్థన మేరకు ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ అనుమతి ఇచ్చింది.ప్రాదేశిక సైన్యంలో ధోనీ గౌరవ హోదాలో ఉన్నందున, అవసరమైతే అతన్ని కూడా విధులకు పిలిచే అవకాశం ఉంది. కానీ ప్రత్యేకంగా ధోనీకి భారత సైన్యం నుంచి ఎలాంటి పిలుపు రాలేదు. ధోనీ తరహాలోనే క్రికెట్‌కు చేసిన సేవలకు గుర్తింపుగా కపిల్ దేవ్‌కు కూడా భారత ప్రాదేశిక సైన్యంలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదా దక్కింది. మాజీ కేంద్ర మంత్రి సచిన్ పైలెట్.. ప్రాదేశిక సైన్యంలో కెప్టెన్ హోదా కలిగి ఉన్నారు. ఆయన గౌరవ హోదాలో కాకుండా.. సాధారణ అధికారిగా ఇందులో చేరారు. ఇందుకు కావాల్సిన శిక్షణను ఆయన పూర్తి చేశారు. ఈ కఠిన సమయంలో భారత్ ఆర్మీకి ఈ ముగ్గురు ప్రముఖులు



# కమలహాసన్ ఈవెంట్‌వాయిదా




Raajkamal Films International

09.05.2025

STATEMENT FROM KAMAL HAASAN

Art can wait. India comes first.

In view of the developments at our nation's border and the current state of heightened alert, we have **decided to reschedule the audio launch of *Thug Life***, originally planned for the 16th of May.

As our soldiers stand firm on the frontlines with unflinching courage in defence of our motherland, I believe it is a time for quiet solidarity, not celebration. A **new date will be announced at a later, more appropriate time.**

At this time, our thoughts are with the brave men and women of our armed forces who stand vigilant, safeguarding our nation. As citizens, it is our duty to respond with restraint and solidarity. **Celebration must make way for reflection.**

– Kamal Haasan

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమా థగ్ లైఫ్. జూన్ 5న రిలీజ్ కానున్న ఈ సినిమా ఆడియో లాంచ్ ను ఘనంగా నిర్వహించాలని మేకర్స్ ప్లాన్ చేశారు. మే 16న ఈ సినిమా ఆడియో లాంచ్ ను చేయాలని ఆల్రెడీ ప్లాన్ చేయగా, తాజా పరిణామాల నేపథ్యంలో చిత్ర యూనిట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఇది సెలబ్రేషన్స్ టైమ్ కాదని, మూవీ ఆడియో రిలీజ్ ఈవెంట్ ను మేకర్స్ పోస్ట్ పోన్ చేశారు. ఈ విషయాన్ని కమల్ హాసన్ స్వయంగా ఓ ప్రెస్ నోట్ ద్వారా తెలిపారు. మాతృభూమి పరిరక్షణలో పోరాటం చేస్తున్న ఈ టైమ్ లో మనం సెలబ్రేట్ చేసుకోవడం కరెక్ట్ కాదని వెల్లడించారు. మేం దేశ పౌరులుగా బాధ్యతతో వ్యవహరిస్తున్నాం, సైనికులకు మా మద్దతు తెలియచేస్తున్నాం, అందుకే మే 16న జరగాల్సిన ఆడియో రిలీజ్ ను వాయిదా వేస్తున్నామని, త్వరలోనే కొత్త డేట్ ను అనౌన్స్ చేస్తామని కమల్ తెలిపారు. 1987లో నాయకన్ సినిమాతో కమల్- మణిరత్నం కాంబినేషన్ లో సినిమా వచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు వీరి కాంబినేషన్ లో థగ్ లైఫ్ వస్తోంది. గ్యాంగ్ స్టర్, యాక్షన్ డ్రామా నేపథ్యంలో రూపొందుతున్న థగ్ లైఫ్ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా, శింబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు కమల్ హాసన్ నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆల్రెడీ ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్లు, టీజర్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది.



# నా పిల్లలను అలా మాత్రం పెంచను : ఇలియానా

ఒకప్పుడు తెలుగు తెరపై అగ్ర కథానాయికగా వెలుగొందిన గోవా సుందరి ఇలియానా ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై పూర్తి దృష్టి సారించారు. త్వరలోనే రెండో బిడ్డకు ఆమె జన్మను ఇవ్వబోతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో ముచ్చటించిన ఇలియానా, పిల్లల పెంపకం మరియు నిజమైన ప్రేమ గురించి తన అమూల్యమైన అభిప్రాయాలను పంచుకున్నారు.కెరీర్‌లో ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడే తెలుగు చిత్రసీమకు దూరమై, బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఇలియానా, అక్కడ కూడా పలు చిత్రాల్లో నటించి మెప్పించారు. అయితే, గత కొంతకాలంగా సినిమాలకు విరామం ప్రకటించిన ఆమె, తన వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇటీవల సోషల్ మీడియా ద్వారా అభిమానులతో నిర్వహించిన ఒక ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఇలియానా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒక అభిమాని, "పిల్లలు మంచిగా పెరగాలంటే తల్లిగా ఏం చేయాలి? నిజమైన ప్రేమ అంటే ఏమిటి?" అని ప్రశ్నించారు. దీనికి ఇలియానా ఎంతో పరిణతితో కూడిన సమాధానమిచ్చారు."ప్రేమను 'సంపాదించుకోవాలి' అనే భావనతో మాత్రం నా పిల్లల్ని పెంచను. ఎందుకంటే, అది నేను అనుభవించిన అత్యంత చెత్త అనుభూతి" అని ఇలియానా తెలిపారు. "ప్రేమ అనేది స్వతహాగా ఉండాలి. అది సంపాదించుకుంటే వచ్చే వస్తువు కాదు. గౌరవం, ఆనందంలాగే ప్రేమ కూడా సహజంగా, స్వచ్ఛంగా ఉండాలి" అని ఆమె వివరించారు."నా పిల్లలను దయగల వ్యక్తులుగా, ఎల్లప్పుడూ సంతోషంగా, ఆరోగ్యంగా జీవించేలా పెంచాలనుకుంటున్నాను. ప్రతి తల్లిదండ్రులూ కోరుకునేది ఇదేనని నేను భావిస్తున్నాను. పిల్లలు తమ తల్లిదండ్రులచే ఎంతగా ప్రేమించబడుతున్నారో వారికి తెలిసేలా చేయడానికి నా వంతు కృషి చేస్తాను. సహజసిద్ధమైన తల్లి ప్రేమ, భావోద్వేగాలను నేను ఎంతగానో ఇష్టపడతాను" అని ఇలియానా తన మనసులోని మాటను పంచుకున్నారు.

# శ్రీవిష్ణుకి మరో హిట్



శ్రీ విష్ణు తాజా చిత్రంగా ఈ రోజున ప్రేక్షకుల ముందుకు 'సింగిల్' వచ్చింది. టీజర్ .. ట్రైలర్ జనంలోకి వచ్చేంతవరకూ పెద్దగా బజ్ లేదు. అయితే ఆ తరువాత కొన్ని వివాదాస్పదమైన అంశాలు అందరి దృష్టినీ ఈ సినిమా వైపుకు మళ్లించాయి. దానికి తోడు చాలా కాలం తరువాత ఒకేసారి హాట్ బ్యూటీలను తెరపై చూసే అవకాశం కూడా ఈ సినిమాతో కలిగింది. ఏదైతేనేం ఈ సినిమాకి మంచి ఓపెనింగ్స్ అయితే పడ్డాయి. శ్రీవిష్ణుకి సరైన హిట్ పడి చాలాకాలమే అయింది. అందువలన గట్టి హిట్ ఒకటి పడాల్సిందే అనే పట్టుదలతో ఆయన ఉన్నాడు. ఈ నేపథ్యంలో వచ్చిన 'సింగిల్' తో ఆయనకి హిట్ పడినట్టేనా? అనే ప్రశ్న రేజ్ అవుతోంది. థియేటర్ రెస్పాన్స్ అందుకు సమాధానంగా కనిపిస్తోంది. అందుకు అవసరమైన అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయనే టాక్ బలంగా వినిపిస్తోంది. కథ పాతదే అయినా ట్రీట్మెంట్ ఇంట్రెస్టింగ్ గా ఉందని అంటున్నారు. మేకింగ్ క్వాలిటీ విషయంలో మరింత శ్రద్ధ పెట్టవలసిందనీ అంటున్నారు. ఈ మధ్య కాలంలో సినిమాలలో కమెడియన్స్ చాలామంది కనిపిస్తున్నారు .. కానీ కామెడీనే కనిపించడం లేదు. అలా కాకుండా ఈ సినిమాలో కామెడీ బాగా వర్కౌట్ అయిందని చెబుతున్నారు. కొన్ని సినిమాలలో కథ .. మరికొన్ని సినిమాలలో కథనం .. పాటలు ఆ సినిమా సక్సెస్ లో ప్రధానమైన పాత్రను పోషిస్తూ ఉంటాయి. అలా చూసుకుంటే సంభాషణలు .. సన్నివేశాలు ఈ సినిమాను సక్సెస్ దిశగా నడిపించే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

# సైనికుల సంక్షేమం కోసం అల్లు అరవింద్ స్ఫూర్తి!



ఇండియా – పాక్ వార్ దృశ్యాలు గగుర్పాటుకు గురి చేస్తున్నాయి. పాక్ ఉగ్ర మూకలపై భారతదేశం ఆధిపత్యం సాధించింది. దీనికి ప్రజలు, సెలబ్రిటీల నుంచి మద్దతు లభిస్తోంది. క్రూరమైన ఉగ్రవాదులను మట్టుపెడుతున్న భారతీయ సైన్యం పనితనానికి దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తున్నాయి. ఆపత్కాలంలో మేమున్నాం అంటూ స్పందించే టాలీవుడ్ లో తొలిగా భారత సైన్యానికి విరాళాల రూపంలో తమవంతు సాయం చేసేందుకు అగ్రనిర్మాత అల్లు అరవింద్ ముందుకు వచ్చారు. ఈరోజు విడుదలైన సింగిల్ మూవీ మొదటి రోజు కలెక్షన్స్ నుంచి కొంత భాగాన్ని సైనికులకు విరాళంగా ఇస్తున్నామని ప్రకటించారు. దేశం కోసం ప్రజల్ని కాపాడటం కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయక సైనికులు పోరాడుతున్నారు. వారి సంక్షేమం కోసం సహాయం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత. మా వంతు విరాళంగా సింగిల్ మూవీ మొదటి రోజు వసూళ్ల నుంచి కొంత మొత్తాన్ని సైనికుల సంక్షేమం కోసం అందిస్తున్నాం.. అని అరవింద్ ప్రకటించారు. అల్లు అరవింద్ ప్రకటన అందరిలో స్ఫూర్తి నింపుతోంది. మరింత మంది టాలీవుడ్ ప్రముఖులు ముందుకు వచ్చి భారత సైన్యం సాయానికి ప్రేరణనిచ్చే ప్రకటన ఇది. ప్రకృతి వైపరీత్యాలు, వరదల సమయంలో ప్రతిసారీ టాలీవుడ్ సాయానికి ముందుకు వస్తోంది. వరదల్లో మునిగిన నగరాల పునర్నిర్మాణం కోసం తెలుగు స్టార్లు ఆర్థిక విరాళాల్ని ప్రకటించారు. ఇప్పుడు ఆర్మీ బలోపేతానికి విరాళాలు అవసరం. తెలుగు ప్రజలు కూడా పాక్ పై పోరాడుతున్న భారతీయ సైనికుల కోసం సాయానికి తమవంతుగా ముందుకు వస్తున్నారు. ప్రజలు, సెలబ్రిటీల నుంచి మద్దతు సైనికులకు మరింత బలాన్నిస్తుందనడంలో సందేహం లేదు.






# 'పెద్ది'లో శ్రీలీల ఐటమ్ సాంగ్?

అల్లు అర్జున్, సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప 2 సినిమాలో కిస్సిక్ అంటూ శ్రీలీల చేసిన ఐటమ్ సాంగ్ సినిమాను మరో స్థాయికి తీసుకు వెళ్లింది. అందుకే శ్రీలీల క్రేజ్ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో పెరిగింది. కిస్సిక్ కారణంగానే బాలీవుడ్‌లో సినిమాను చేసే అవకాశంను దక్కించుకుంది. తమిళనాట కూడా ఈ భామ ఒక సినిమాను చేస్తోంది. హీరోయిన్‌గా వరుసగా సినిమాలు చేస్తున్న శ్రీలీల త్వరలోనే తెలుగులో ఒక బిగ్ సినిమాలో ఐటమ్ సాంగ్ చేయబోతుందనే వార్తలు వస్తున్నాయి.రామ్ చరణ్ హీరోగా ఉప్పెన దర్శకుడు బుచ్చి బాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. బుచ్చి బాబు ఈ సినిమా కోసం ఒక స్పెషల్ సాంగ్‌ను ప్లాన్ చేస్తున్నాడట. ఈ పాటను శ్రీలీలతో చేయిస్తే ఎలా ఉంటుంది అనే విషయాన్ని నిర్మాతలు చర్చించారని సమాచారం. పుష్ప 2 సినిమాలో శ్రీలీల ఐటమ్ సాంగ్‌తో ఆకట్టుకుంది. దీంతో 'పెద్ది'లో శ్రీలీలను ఐటమ్ సాంగ్ కు ఎంపిక చేస్తే బాగుంటుదని ఫిల్మ్‌మేకర్స్ భావిస్తున్నారట. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించే ఈ పాట సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉంటుందట.